ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

గురువారం 5 డిసెంబరు 2024



- రాయితీ రుణాలను అటకెక్కించిన గత ప్రభుత్వం
- కూటమి పాలనలో జిల్లాల వారీగా నిధులు కేటాయింపు
- లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు



రుణాల విషయంలో బీసీ సంఘాల నాయకులకు కలెక్టరేట్‌లో నిర్వహించిన అవగాహన సదస్సు (ఫైల్)

బీసీ కార్పొరేషన్‌కు... రుణ కళ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వెనకబడిన వర్గాల సాధికారత కోసం ఏర్పాటు చేసిన బీసీ కార్పొరేషన్‌ను కేవలం అలంకారప్రాయంగా మార్చి ఐదేళ్ల పాటు రాయితీ రుణాలు అనే మాటే లేకుండా గత ప్రభుత్వం పాలన సాగించింది. రాయితీ రుణాలు అందక ఆయా కులవృత్తుల వారితో పాటు నిరుద్యోగులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఈ ఐదేళ్ల వ్యవధిలో దాదాపు లక్ష మంది బీసీలు ఈ రాయితీ ఫలాలకు దూరంగా ఉండిపోయారు. కూటమి ప్రభుత్వం బీసీల ఆర్థిక సాధికారతను అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకుని కార్పొరేషన్‌కు జవసత్వాలు కల్పించడంతో పాటు రాయితీకి సంబంధించి లబ్ధిదారుల సంఖ్యతో పాటు నిధుల మంజూరుపై కూడా స్పష్టత ఇవ్వడంతో ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే జిల్లాల్లో బీసీ సంఘాలతో సమావేశాలు కూడా పెట్టిన అధికారులు లబ్ధిదారుల ఎంపికను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జరపడానికి కసరత్తు చేస్తున్నారు

2014-19 మధ్య పెద్ద సంఖ్యలో లబ్ధి...

2014-19 మధ్య టీడీపీ పాలనలో వెనకబడిన వర్గాలకు వివిధ పథకాల ద్వారా పెద్ద ఎత్తున లబ్ధి చేకూరింది. వాటిలో (మిగతా 8వ పేజీలో..)

కార్పొరేషన్ క్రియాశీలకంగా...

ఈ మొత్తం రుణాల ప్రక్రియలో బీసీ వెల్ఫేర్ విభాగంతో పాటు కార్పొరేషన్‌కూడా పూర్తి స్థాయిలో భాగస్వామ్యం కానున్నాయి. ఏకపక్ష నిర్ణయాలు కాకుండా తొలి దశ కింద బీసీ కార్పొరేషన్ అధికారులు ఆయా బీసీ కుల సంఘాల ప్రతినిధులతో సమావేశమై రుణాల మంజూరులో తగిన సూచనలు, సలహాలు కోరుతున్నారు. లబ్దిదారుల ఎంపికలో కూడా ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా ప్రక్రియ జరగాలనే ఆదేశాలు ఇప్పటికే సంబంధిత అధికారులకు అందాయి.

- మున్సిపాలిటీల్లో పేరుకుపోతోన్న పన్నులు
- మొండిబకాయిల్లో ప్రభుత్వ కార్యాలయాల వాటానే అధికం
- నోటీసులు జారీ చేస్తున్నా పట్టించుకోని శాఖాధికారులు
- మార్చికి వసూలు చేయాలని ఆదేశాలు.. లక్ష్యం నెరవేరేనా?

బకాయిల భారం



ఆంధ్రజ్యోతి ఫోకస్

(ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్)

సామాన్యుడు పన్ను చెల్లించకపోతే మున్సిపల్ అధికారులు నానాయాగీ చేస్తారు. నగదు సర్దుబాటు కాక ఆలస్యంగా చెల్లిస్తే జరిమానాలు వేస్తారు. అలాంటిది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, వారి ఆస్తులకు సంబంధించిన పన్నులు రూ.లక్షలో పేరుకుపోతున్నా పట్టడంలేదు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాలిటీల పరిధిలో పదుల సంఖ్యలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, ఆయా శాఖలకు సంబంధించిన ఆస్తులు ఉన్నాయి. అయితే కొన్ని శాఖల నుంచి రెండు దశాబ్దాలుగా పన్ను బకాయిలు పేరుకుపోయాయి. అసలు తాము మున్సిపాలిటీ పరిధిలో ఉన్నాము.. మున్సిపాలిటీ నుంచి సౌకర్యాలు పొందుతున్నాము.. అందుకు పన్నులు చెల్లించాలి.. అన్న విషయమే ఆయా శాఖలు మరిచాయి. ఈ కారణంగా ఆయా శాఖల కార్యాలయాలకు సంబంధించి రూ.లక్షల్లో పన్ను బకాయిలు పేరుకుపోయాయి. మార్చి కల్లా బకాయిలు వసూలు చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. అయితే బకాయిలు చెల్లించాలన్న స్పృహ ఆయా శాఖల అధికారుల్లో లేదు. వసూలు చేయాలన్న ఆలోచన మున్సిపల్ అధికారుల్లో కానరావడంలేదు. పురపాలక సంఘాలకు ప్రధాన ఆదాయ వనరు.. పన్నులు. ఇలాంటి పన్నులు పేరుకుపోతున్నా వసూళ్లపై అధికారులు దృష్టి సారించడంలేదని, అందువల్లే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయిలు రూ.కోట్లకు చేరాయని తెలుస్తోంది. పన్నుల వసూళ్లలో కనీస ప్రయత్నం కూడా ఉండటంలేదని ఈ ఆర్థిక సంవత్సరంలో వసూలైన పన్నులను చూస్తే తెలుస్తోంది. కమిషనర్లు ఆయా శాఖల అధికారులకు పన్ను బకాయిలకు సంబంధించి ఎప్పటికప్పుడు నోటీసులు జారీ చేస్తున్నా.. వారు పట్టించుకోవడంలేదు. ఏటికేడు బకాయిలు పేరుకుపోతున్నా చెల్లింపులపై ఆయా శాఖల అధికారులు ఆలోచన చేయడంలేదు. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి ఆస్తి పన్ను కొన్నేళ్లుగా కొండలా పేరుకుపోయాయి. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి రైల్వే, బీఎస్ఎన్ఎల్, పోస్టల్ తదితర శాఖల పన్నులు పెద్దఎత్తున పేరుకుపోయి ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి ఏపీ సీపీడీసీఎల్, పోలీస్, జ్యూడిషియల్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, విద్యాశాఖలకు సంబంధించి పన్నులు వసూలు కావాల్సి ఉంది.



తహసీల్దారు కార్యాలయ బాకీ రూ.29 లక్షలు

నరసరావుపేట: మున్సిపాల్టీ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు రూ.2.50 కోట్లకుపైగా పేరుకుపోయాయి. తహసీల్దారు కార్యాలయం రూ.29 లక్షలు, పంచాయతీరాజ్ రూ.18 లక్షలు, టెలికం రూ17 లక్షలు, టౌన్‌హాల్ రూ.17 లక్షలు, పోలీసు రూ.24 లక్షలు, తపాలా కార్యాలయం రూ.13 లక్షలు, ఆర్అండ్‌బీ రూ.12 లక్షలు, అంజుమన్ రూ.18 లక్షలు, ఎస్సీ సర్వీస్ కో-ఆపరేటివ్ సొసైటీ రూ.31 లక్షలు, రైల్వేస్టేషన్ రూ.9 లక్షలు, పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్ రూ.8 లక్షలు, ఆర్డీవో కార్యాలయం రూ.7 లక్షలు, ఎస్ఎస్‌పీ రూ.24 లక్షలు, గ్రంథాలయం రూ.7 లక్షలు, ఎంపీడీవో కార్యాలయం రూ.7 లక్షలు, సాంఘిక సంక్షేమ శాఖ రూ.7 లక్షలు, సివిల్ జడ్జి కోర్టు రూ.7 లక్షలు, షాదీఖానా రూ.5 లక్షలు పన్ను చెల్లించాల్సి ఉంది.



బకాయిలు రూ.77.80 కోట్లు

గుంటూరు: గుంటూరులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు 984 ఉండగా ఇంతవరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో 705 కార్యాలయాలు ఉండగా రూ.35.46 లక్ష బకాయి ఉంది. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి 279 కార్యాలయాలు ఉండగా బకాయి రూ.77.45 కోట్లు పెండింగ్‌లో ఉంది. ఆయా కార్యాలయాలకి సంబంధించిన బకాయి రూ.77.80 కోట్ల ఉన్నట్లు నగర పాలక సంస్థ అధికారులు తెలిపారు. రూ.కోట్లలో బకాయిలు పెండింగ్‌లో ఉన్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ విషయంపై నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారులను వివరణ కోరగా ఇప్పటికే నోటీసులు పంపించామని తెలిపారు.



రూపాయి కూడా చెల్లించని ఎయిమ్స్

మంగళగిరి: మంగళగిరి పరిధిలో ఆస్తి పన్నుల బకాయి పేరుకుపోతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సిన బకాయిలు రూ.5,35,32,259 వుంది. మంగళగిరి డివిజన్‌లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల నుంచి రావాల్సిన బకాయిలు రూ.1,03,51,884 ఉన్నాయి. వీటిలో అత్యధికంగా ప్రధాన తపాలా కార్యాలయం నుంచి రూ.49,5,8,202 బకాయి రావాల్సి ఉంది. ఎయిమ్స్ సహా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఎన్నో ఏళ్లుగా బకాయిలు చెల్లించడం లేదు. మంగళగిరి డివిజన్‌లోని 413 రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి అసెస్‌మెంట్లకు రూ.2,57,72,923 బకాయి ఉంది. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి శిథిల భవనాలను తొలగించి ఏళ్లు గడుస్తున్నా నేటి వరకు పన్ను నుంచి మినహాయింపు లభించలేదు.

అత్యధిక బకాయి డెల్టా విభాగం

తెనాలి: తెనాలి మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయి రూ.4.91 కోట్ల వరకు ఉంది. వీటికి సంబంధించి పెనాల్టీలే రూ.20 లక్షల వరకు ఉన్నాయి. అయితే అత్యధికంగా కృష్ణా పశ్చిమడెల్టా విభాగం రూ.1.18 కోట్లు బకాయి ఉన్నట్లు మున్సిపల్ లెక్కలు చెబుతున్నాయి. డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం రూ.71.49 లక్షలు, పోలీస్ శాఖ నుంచి రూ.41.52 లక్షలు వసూలు కావాల్సి ఉంది. ఎస్సీ, ఎస్టీ హాస్టల్ భవనాలకు సంబంధించి రూ.అరకోటి వరకు బకాయి ఉంది. తోటి ప్రభుత్వ శాఖలే కదా అన్న ప్రేమో! లేక ప్రభుత్వ డబ్బే కదా ఎక్కడికి పోతుందిలే అన్న ధీమానో తెలియదు కానీ, ఆయా శాఖలకు ఏటా మార్చినాటికి పలుసార్లు నోటీసులు జారీచేసి తర్వాత మున్సిపల్ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. దీంతో బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోతూనే ఉన్నాయి.



అసలు రూ.62 లక్షలు.. వడ్డీ రూ.46 లక్షలు



తాడేపల్లి: తాడేపల్లి పరిధిలో ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయిలు రూ.62 లక్షలు ఉండగా వడ్డీల రూపంలో మరో రూ.46 లక్షలు రావాల్సి ఉంది. పీడబ్ల్యూడీ వర్క్‌షాప్ రూ.31.23 లక్షలు, బోట్ యార్డ్ రూ.4.56 లక్షలు, తహసీల్దార్ కార్యాలయం రూ.3.56 లక్షలు, ఎంపీడీవో కార్యాలయం రూ.3.15 లక్షలు పోలీసు స్టేషన్ రూ.1.39 లక్షలు, క్వార్టర్స్ రూ.1.46 లక్షలు, సీతానగరం, శ్రీమద్విరామాంజనేయ దేవాలయం రూ.1.65 లక్షలు బకాయిలు ఉన్నట్టు అధికారులు తెలిపారు.

43 కార్యాలయాలు.. రూ.1.45 కోట్ల బకాయి

పొన్నూరు: పొన్నూరులో 43 ప్రభుత్వ కార్యాలయాలు ఉండగా రూ.1,45,61,975 పన్ను బకాయిలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయం రూ.21,52,868, పీషరీష్ కార్యాలయం రూ.21,46,140, పంచాయతీరాజ్ డీఈ కార్యాలయం రూ.16,33,162, ట్రాన్స్‌కో రూ.13,04,645 బకాయిలు ఉన్నాయి. నీటి పారుదలశాఖ, పోలీస్‌స్టేషన్లు, మండల ప్రజా పరిషత్ కార్యాలయం, పోలీస్ క్వార్టర్ల పన్ను బకాయిలు భారీగా పేరుకుపోయాయి. అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు పన్ను బకాయిలు చెల్లించాలని నోటీసులు జారీ చేసినట్లు మున్సిపల్ రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు.



- ముగిసిన వీరారాధన ఉత్సవాలు
- పోతురాజుగుట్ట వద్ద తంగెడ మండలపై ఒరిగిన కొణతములు



గ్రామోత్సవంలో పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు, మంత్రి రవికుమార్, ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

కనుల పండువగా కల్లిపాడు

8

వెంకన్న ఆలయానికి మహర్దశ



వెంకటపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయం

- పూర్వపు ప్లాన్ ప్రకారమే పనులు
- పనులకు అడ్డుగా 'సుజల' ప్రధాన వాటర్ ప్లాంట్
- వేరేచోటుకు త్వరగా మార్చాలంటున్న టీటీడీ అధికారులు

గుంటూరు, పల్నాడులో స్వల్పంగా భూ ప్రకంపనలు

- ప్రజల్లో భయాందోళన

6

సీసీఐకి వణుకు!

- సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసిన మాజీ మేనేజర్

సికింద్రాబాద్, బ్రహ్మపూర్, విశాఖపట్నంకు ప్రత్యేక రైళ్లు

అంతర్ జిల్లాల ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

- రూ.8 లక్షల విలువైన 13 వాహనాలు స్వాధీనం

- 7న ప్రభుత్వ బడుల్లో ప్రత్యేక సమావేశాలు
- తల్లిదండ్రులు, గురువులు ఒకే వేదికపైకి..
- పాఠశాల, విద్యార్థి ప్రగతిపై ప్రత్యేకచర్చ
- పాఠశాలల అభివృద్ధిపై దిశానిర్దేశం
- ఉమ్మడి జిల్లాలో ఏర్పాట్లు పూర్తి..
- బాపట్ల జిల్లాలో పాల్గొననున్న సీఎం చంద్రబాబునాయుడు

అమ్మానాన్నలకు ఆహ్వానం

గుంటూరు(విద్య), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని సర్కారు పాఠశాలల్లో ఉపాధ్యాయుల్ని, తల్లిదండ్రుల్ని ఒకే వేదికపైకి తీసుకువచ్చే మహత్తర కార్యక్రమానికి సర్వం సిద్ధం అయింది. సీఎం చంద్రబాబు నాయుడు బాపట్ల జిల్లాలో జరిగే వేడుకల్లో పాల్గొని సమావేశాలను లాంచనంగా ప్రారంభించనున్నారు. ఇక గ్రామస్థాయి నుంచి అన్ని పాఠశాలల్లో 7వ తేదీన విద్యార్థుల తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని ఒకే వేదికపైకి చేర్చి విద్యాపరమైన అంశాలు చర్చించి ప్రభుత్వ పాఠశాలల్ని మరింత బలోపేతం చేసే మహత్తర కార్యక్రమానికి విద్యాశాఖ ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే పాఠశాల స్థాయిలో విద్యార్థినీ విద్యార్థుల ప్రగతి నివేదికలు, వైద్య నివేదికలు సిద్ధం చేశారు. కార్యక్రమ నిర్వహణ కోసం విద్యాశాఖ విద్యార్థుల సంఖ్యను అధారంగా నిధులు మంజూరు చేసింది.

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, యూపీ, మండల పరిషత్ పాఠశాలలు దాదాపు 3,872 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఒకటి నుంచి పదవ తరగతి వరకు 6.97 లక్షల మంది విద్యార్థిని విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈనేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఇద్దరు సమావేశాల్లో పాల్గొనేలా ఇప్పటికే ప్రత్యేక ఆహ్వానాలు పాఠశాల స్థాయి నుంచి హెచ్‌ఎంలు పంపారు.



పాఠశాల సమగ్ర అభివృద్ధికి దిశానిర్దేశం

ప్రభుత్వ పాఠశాలల సమగ్రాభివృద్ధికి ఈ సమావేశాలు దిశానిర్దేశం చేయనున్నాయి. ఏటా పాఠశాల స్థాయిలో జరిగే తల్లిదండ్రుల సమావేశాలకు భిన్నంగా ఈ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు (మిగతా 6వ పేజీలో..)

మిర్చియార్డు ప్రక్షాళన?

- గాడిన పెట్టేందుకు రంగంలోకి ప్రభుత్వం
- నేడు మంత్రి అచ్చెన్నాయుడి అధ్యక్షతన కీలక సమావేశం
- హాజరు కానున్న మార్కెటింగ్ ఉన్నతాధికారులు, మిర్చియార్డు అధికారులు



గుంటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మిర్చియార్డు అంతర్జాతీయ ఖ్యాతి పొందింది. అదే సమయంలో అక్రమాలు, అవినీతికూపంలో కూరుకుపోయింది. గత వైసీపీ హయాం లో నాటి ప్రభుత్వ పెద్దలు మిర్చియార్డును భ్రష్టుపట్టించారు. పాలకవర్గం అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చేసింది. విచ్చలవిడిగా జీరో, కటింగ్, బిల్ టూ బిల్ వ్యా పారాలను అమలు చేయించారు. మరోవైపు కమీషన్ ఏజంట్, వేమెన్ లైసెన్సుల రెన్యువల్స్, పేరు మార్పులతో రూ.కోట్లు దోచేశారు. ఈ పరిస్థితుల్లో మిర్చియార్డు ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఇక్కడి పరిస్థితు లను చక్కదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రూ.వందల కోట్ల అవినీతి జరి గిందని విజిలెన్స్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన దృష్ట్యా యార్డుని గాడిన పెట్టేందుకు తానే రంగంలోకి దిగాలని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు నిర్ణయించారు. గురువారం చుట్టుగుంట సెంటర్‌కు సమీపంలోని మార్కెటింగ్ కమిషనరేట్‌కు రావాల్సిందిగా మిర్చియార్డు అధికారులను ఆదేశించారు. ఈ సమావే శానికి మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి బుడితి రాజశేఖర్, డైరెక్టర్ విజయసునీత, జాయింట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు కూడా హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో సమావేశంలో ఏ అంశాలపై చర్చించి ఎలాంటి ఆదేశాలు జారీ చేస్తారోనన్న ఉత్కంఠ మార్కెటింగ్ వర్గాల్లో నెలకొన్నది. మిర్చియార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ విజిలెన్స్ డీజీకి చేసిన ఫిర్యాదు ఆధారంగా నిర్వహించిన విచారణలో రూ.346కోట్ల అవినీతి జరిగినట్లు ఆ శాఖ తేల్చింది. దీనిపై మంత్రి నిర్వహించే సమావేశంలో చర్చించి చర్యలకు ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

మిర్చి అమ్మి పెట్టేది.. కొనుగోలు చేసేదీ వారే

మిర్చియార్డులో కొంతమంది వ్యాపారులకు బహుళ లైసెన్సులు ఉన్నాయి. కమీషన్, ఎక్స్‌పోర్టు లైసెన్సులు కలిగిన కుటుంబాలు దాదాపుగా 50కి పైగానే ఉన్నట్లు సమాచారం. అయితే ఒకే పేరుతో ఇవి లేకపోవడంతో వాటికి చట్టబద్ధత సమకూరింది. దీంతో రైతు మిర్చియార్డుకు తీసుకొచ్చిన సరుకుకు సరైన ధర లభించే పరిస్థితి లేకుండా పోయింది. ఇందుకు కారణం ధర ఆఫర్ చేసే ఎక్స్‌పోర్టర్, అమ్మే కమీషన్ వ్యాపారి రక్తసంబంధీకులు అవుతుండటమే. ఇక కొంతమంది వ్యాపారులకు కోల్డ్‌స్టోరేజ్‌లు ఉండటంతో వాటిని నింపుకోవడానికి మార్కెట్‌లో ధర పెరగకుండా చూస్తారు. దాంతో రైతు చేసేది లేక కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వ చేసుకునేందుకు మొగ్గు చూపుతాడు. ఈ విధంగా అన్ని వైపుల నుంచి యార్డులో రైతును పిండుకుంటున్నారు. వేలానికి నిర్వచనం పోటీ. అయితే మిర్చియార్డులో ఇందుకు విరుద్ధమైన అర్థం ఉన్నది. వేలం అంటే రైతు ఇష్టాఇష్టాలతో సంబంధం లేకుండా వ్యాపారులే నిర్ణయిస్తారు. ఇందుకు అనుకూలమైన పరిస్థితులను వ్యాపారులే సమకూర్చుకున్నారు. బడా ఫరంలు ఎంత ధరని నిర్ణయిస్తే దానినే ఇతర వ్యాపారులు కూడా అనుసరిస్తూ ఉంటారు. ఇలా యార్డులో రైతు తెచ్చిన మిర్చిని అమ్మి పెట్టేది ఒకరే, కొనుగోలు చేసేది ఒకరే కావడంతో పోటీ లేకుండా పోతున్నది. కేంద్ర ప్రభుత్వం ఈ-నామ్ విధానాన్ని తీసుకొచ్చినా బిడ్డింగ్‌లోనూ పోటీ కనిపించదు. ఒక ఎగుమతి వ్యాపారే బిడ్డింగ్‌లో పాల్గొంటారు. దాంతో అతడే సక్సెసర్ అవుతారు. ఒకవేళ రెండు బిడ్‌లు దాఖలైనా ఆ రెండు కూడా ఆ ఎక్స్‌పోర్టర్‌కు చెందినవే అవుతున్నాయి.

గుట్కా వ్యాపారికి అందలం

గత ప్రభుత్వంలో ఓ గుట్కా వ్యాపారిని వైసీపీ పెద్దలు తీసుకొచ్చి మిర్చియార్డు పీఠంపై కూర్చోబెట్టారు. అనతికాలంలోనే కోకొల్లలుగా అక్రమాలకు పాల్పడి రూ.కోట్లు పోగేసుకొన్నాడు. చంద్రగిరి ఏసురత్నం చైర్మన్‌గా వ్యవహరించిన సమయంలో రెన్యువల్‌కు రావాల్సిన లైసెన్సులను కొందరు కోర్టులో వేసి స్టే తెచ్చుకుని రాకుండా చేశారు. ఆయన రాజీనామా తర్వాత లైసెన్సుల వ్యవహారాన్ని వైసీపీ నేతలు తెరపైకి తెచ్చారు. అధికారులను ఏమార్చి ఒకేసారి ఏకంగా 270కి పైగా లైసెన్సుల రెన్యువల్ చేసేశారు. ఇందులో కనీసం రూ.5 కోట్లు పైగానే చేతులు మారాయన్న విషయం బహిరంగ రహస్యమే.



సమన్వయం, సహకారంతోనే ఉత్తమ ఫలితాలు

● జిల్లా పంచాయతీ అధికారి సాయి కుమార్



శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి సాయి కుమార్

గుంటూరు సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల సమన్వయం, సహకారం తోనే ఉత్తమ ఫలితాలు సాధించటం సాధ్యం అవుతుందని గుంటూరు జిల్లా పంచాయతీ అధికారి బీఎస్ సాయి కుమార్ అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి పంచాయతీ రాజ్ సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు, బాపట్ల జిల్లాలోని వివిధ శాఖల సిబ్బందికి శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన 9 రకాల నినాదాలు దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల భాగస్వామ్యంతో అభివృద్ధి చెందిన గ్రామాల సాధనే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.మోహన్ రావు, ప్రిన్సిపాల్ వెంకట్రావు, పద్మజ, కె.నాగేశ్వరరావు తదితరులు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

అగ్రికల్చర్, ఫుడ్ టెక్నాలజీ కోర్సులకు 6న కౌన్సెలింగ్

గుంటూరు సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ అగ్రికల్చర్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సులకు ఈ నెల 6న మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్ లాం ఫామ్‌లోని కృష్ణ ఆడిటోరియంలో ఉదయం 9.30 గంటలకు ప్రారంభం అవుతుందని తెలిపారు. ఎన్ఆర్ఐ కోటా బీస్సీ కమ్యూనిటీ సైన్సు, బీస్సీ అగ్రికల్చర్ ఫైనల్ కౌన్సెలింగ్ అదే రోజు జరుగుతుందన్నారు.

ఆరోపణలపై విచారణకు వీసీ ఆదేశం

పెదకాకాని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తనపై వచ్చిన నిరాధార ఆరోపణలపై విచారణ చేసి న్యాయం చేయాలని కోరుతూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన వర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధరరావును కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. తనపై అసత్య ఆరోపణలు చేస్తూ తన పరువుతోపాటు యూనివర్సిటీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఒక పరిశోధకురాలు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. తాను కారుతో గుద్ది ఆమెను ప్రమాదానికి గురి చేసినట్లు ఆరోపించిందని లేఖలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జరిగిన సంఘటనపై శాఖాపరమైన విచారణకు యూనివర్సిటీ యాజమాన్యం ఆదేశించింది. ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే ముందుగా యూనివర్సిటీలోని సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.

ఉప్పలపాడు చెరువులో గుర్తుతెలియని మృతదేహం

పెదకాకాని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని ఉప్పలపాడు చెరువులో గుర్తుతెలియని మృతదేహం లభించినట్లు బుధవారం పెదకాకాని పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మృతుని వయసు సుమారు 50 ఏళ్లు ఉంటుంది. ఒంటిపైన నల్లగళ్ల లుంగి, శనగపిండి రంగు కలర్ ఫుల్‌హ్యాండ్ చొక్కా ధరించి ఉన్నాడు. నాలుగు రోజుల క్రితం చెరువులో పడి మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 41.85 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 4,549 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతున్నాయి.

సీసీఐకి వణుకు!

- సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసిన మాజీ మేనేజర్
- స్టాడింగ్, క్వాలిటీ కటింగ్ వ్యవహారం వెలుగులోకి
- అదనపు దూది.. అడ్డదారి అమ్మకాలపై ఆందోళన
- మల్లగుల్లాలు పడుతున్న అధికారులు, బయ్యర్లు

గుంటూరు సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీసీఐ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. గుంటూరులో సీసీఐలో పనిచేసిన మాజీ మేనేజర్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యవహారంలో కౌంటర్ దాఖలు చేయాలని మార్కెటింగ్ శాఖను హైకోర్టు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని సీసీఐ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మాజీ మేనేజర్ మొదట వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి పిటిషన్ అందజేశారు. ఈ నేపథ్యంలో ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్ కొద్ది రోజుల క్రితం గుంటూరులోని పత్తి కొనుగోలు కేంద్రాలను రహస్యంగా తనిఖీ చేశారు. మేనేజర్‌గా పనిచేసిన వ్యక్తి ఇటువంటి డిమాండ్‌ను తీసుకురావడం అందరిలోనూ ఆసక్తి కలిగించింది. ఈ పిటిషన్‌తో బయ్యర్లు ఆందోళన చెందుతున్నట్టు తెలిసింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని సీసీఐ కేంద్రాల్లో లక్ష ఇరవై వేల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. అందులో కటింగ్ పేరుతో అవకతవకలు జరిగినట్లు తెలిసింది.

క్వింటాల్‌కు రెండు కిలోలు..

సాధారణంగా సీసీఐకి రైతులు తీసుకువచ్చే పత్తి మొత్తానికి నగదు చెల్లించాలి. కానీ చాలా చోట్ల బయ్యర్లు స్టాడింగ్ కటింగ్, క్వాలిటీ కటింగ్ పేరుతో క్వింటాల్‌కు రెండు కిలోలకు తగ్గకుండా పత్తికి కోత విధించారు. కొన్నిచోట్ల తేమ పేరు చెప్పి అదనంగా కూడా కోతలు పెట్టినట్లు తెలుస్తోంది. ఈ విధానంలో సేకరించిన పత్తిని కొనుగోలు చేసిన పత్తితో కలిపి జిన్నింగ్ వేస్తారు. కొనుగోలు చేసిన క్వింటాళ్ల ఆధారంగా, కటింగ్ చేసిన మొత్తాన్ని లెక్కించి అదనంగా వచ్చిన దూది బేళ్లను (ఒక బేలు సుమారు 165 కిలోలు) ప్రైవేటుగా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇది ప్రతి ఏటా జరిగే ప్రక్రియ అనే చెబుతున్నారు. అయితే ఈ ఏడాది ఈ వ్యవహారం సీజన్ మధ్యలోనే వెలుగులోకి వచ్చింది.


సీసీఐ కేంద్రాల్లోని పత్తి బేళ్లు

ఆ లెక్కే వేరు..

ఒక క్వింటాల్ పత్తిలో 63 శాతం విత్తనాలు, 32 శాతం దూది, 2 నుంచి 5 శాతం ప్రొడక్షన్ లాస్ కింద లెక్కిస్తారు. అక్టోబరు తర్వాత వచ్చే పత్తిలో ఔట్ రన్ (దూది శాతం) పెరుగుతుంది. ఉదాహరణకు 500 క్వింటాళ్ల పత్తిని జిన్నింగ్ వేస్తే 100 బేళ్ల దూది, సుమారు ఆరు లారీల విత్తనాలు వస్తాయి. అదే లెక్కన బయ్యర్లు రైతుల వద్ద కటింగ్ చేసిన పత్తికి కూడా దూది, విత్తనాలు పక్కకు తీస్తారు. అత్యంత విశ్వసనీయ వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం 10 బేళ్ల దూది వస్తే ఒక బేలు అనధికారికంగా బయ్యర్ ఖాతాలో జమ అవుతుందని సమాచారం. ఈ లెక్కన జిల్లాలో గతేడాది 1.30 లక్షల పత్తి బేళ్లు సీసీఐ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన పత్తి నుంచి తీశారు. దానికి తగినట్లుగానే అదనపు బేళ్లు బయటకు పంపినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం పత్తి క్యాండీ (రెండు దూది బేళ్లు ఒక క్యాండీ) విలువ రూ. 50 వేలు పలుకుతుంది. ఈ ఏడాది అదనపు పత్తి బేళ్లను చాలామంది బయ్యర్లు ప్రైవేటుగా అప్పుడే అమ్మేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరు బయ్యర్లు మిల్లుల యజమానులకే వాటిని విక్రయించినట్లు సమాచారం. వచ్చిన దాంట్లో అందరికీ పంపకాలు చేస్తున్నట్లు ఒక బయ్యర్ చేసిన వ్యాఖ్యలు రికార్డు అయ్యాయి. ప్రస్తుత పిటీషన్‌తో మొత్తం విషయంపై చర్చ జరుగుతోంది. ప్రస్తుతం సీసీఐ కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు నిబంధన ఉందని అధికారులు చెబుతున్నారు. మాజీ మేనేజర్‌తో మాట్లాడి పిటిషన్ విత్‌డ్రా చేయించేందుకు పలువురు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

సమస్యలు పరిష్కరించి అండగా నిలుస్తాం

- 49వ రోజు ప్రజాదర్బార్‌లో మంత్రి నారా లోకేశ్ భరోసా

తాడేపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్‌లో వచ్చే సమస్యలు పరిష్కరించి బాధితులకు అండగా నిలుస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. ఉండవల్లిలోని నివాసంలో 49వ రోజు ప్రజాదర్బార్‌కు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మంత్రిని కలిసి తాము ఎదుర్కొంటున్న కష్టాలు, సమస్యలను విన్నవించారు. ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించిన మంత్రి పలు సమస్యల పరిష్కారానికి అప్పటికప్పుడే సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు అన్ని విధాలా అండగా నిలుస్తామని చెప్పారు.

విడదల రజని అండతో అక్రమంగా సస్పెండ్ చేశారు

రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థలో 19 ఏళ్లగా అవుట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న ఐటీ మేనేజర్, ఈఈ, ఎంబీసీ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డీఈవో, అటెండర్ల సర్వీసును గుర్తించి కాంట్రాక్ట్ బేసిక్ విధానంలోకి మార్చాలని ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. సమాన పనికి సమాన వేతనం అందేలా చూడాలని విన్నవించారు. వైసీపీ పాలనలో అప్పటి మంత్రి రజని అండతో నాడు-నేడు పనుల్లో అవినీతికి బాధ్యుడిని చేసి అక్రమంగా సస్పెండ్ చేశారని, తన సస్పెన్షన్ కాలాన్ని క్రమబద్ధీకరించాలని పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన స్కూల్ అసిస్టెంట్ వి.వీరయ్య మంత్రికి విజ్ఞప్తి చేశారు. నాడు-నేడు పనుల్లో అవినీతికి పాల్పడిన చిలకలూరిపేట జడ్పీ హైస్కూల్ హెచ్ఎం కె. రత్నజ్యోతిని కాపాడేందుకు అప్పటి పల్నాడు డీఈవో కాగిత శామ్యూల్, నర్సరావుపేట ఎంఈవో


దివ్యాంగుల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

ఎస్.నాగేశ్వరరావును విడదల రజని ప్రభావితం చేసి తనను బలిపశువును చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం కింద భూములు కోల్పోయిన వారికి త్వరితగతిన నష్టపరిహారం అందించేలా చర్యలను తీసుకోవాలని ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం ఏజెన్సీ ప్రాంత రైతులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గోపాల మిత్రల సమస్యలు పరిష్కరించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని సిబ్బంది మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన గోపాలమిత్ర వ్యవస్థను వైసీపీ ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేసిందన్నారు. మంగళగిరి నియోజకవర్గంలోని తాడేపల్లి మండలం వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ నుంచి రేవేంద్రపాడు వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసమైందనీ, మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని గుండిమెడకు చెందిన సరిత విజ్ఞప్తి చేశారు. వారం క్రితం కేఎల్‌యూ వరకు పనులు చేసి అనంతరం నిలిపివేశారన్నారు. ఈ మార్గంలో రాత్రి వేళల్లో ప్రయాణ సౌకర్యం ఉండదనీ, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని వివరించారు. అలాగే గుండిమెడ పంచాయతీ పరిధిలోని గుంతలు పూడ్చి వీధిలైట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం దివ్యాంగుల నుంచి వినతి పత్రాలు స్వీకరించి సమస్యలు పరిష్కరిస్తానని లోకేశ్ భరోసా ఇచ్చారు.


అమ్మానాన్నలకు ఆహ్వానం

(5 పేజీ తరువాయి)

జారీ చేసింది. పాఠశాలల్లో విద్యాకమిటీ ఎన్నికలు పూర్తి అయ్యాయి. కమిటీ సభ్యుల్ని, తల్లిదండ్రుల్ని పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములుగా చేసి ఎప్పటికప్పుడు విద్యార్థుల ప్రతిగతి, పాఠశాల అభివృద్ధి పర్యవేక్షించేలా కార్యచరణ సిద్ధం చేశారు.

- పాఠశాలలో అభివృద్ధికి అవసరమైన కొనుగోళ్ళ బడ్జెట్, సుందరీకరణ, పర్యావరణ పరిక్షణ, మరుగుదొడ్లు, విద్యార్థులు, ఉపాధ్యాయుల అంతర్గత సమస్యలు, మంచినీరు ఇతర అంశాలపై సమావేశంలో చర్చిస్తారు. .
- విద్యార్థుల ప్రగతి, వారి ఆరోగ్యానికి సంబంధించిన వైద్య నివేదికలు అంటే శారీరక, మానసిక, కంటి సంబంధ సమస్యలు, పౌష్టికాహార లోపం వంటివి ఇందులో నివేదిస్తారు. కొన్నిచోట్లు ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.
- పాఠశాల పూర్తి అయిన తరువాత ఇంటి వద్ద విద్యార్థుల్ని ఎలా పర్యవేక్షించాలి? సెల్‌ఫోన్, టీవీలు, ట్యాబ్‌లు, ఇతర సామాజిక మాధ్యమాల వినియోగంపై నియంత్రణ ఎలా ఉండాలి? వంటి అంశాలు చర్చిస్తారు.
- ప్రత్యేక సమావేశాల సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు, తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

పాఠశాలల్లో తల్లిదండ్రుల భాగస్వామ్యం పెంచడానికే: డీఈవో రేణుక



పాఠశాలల్లో జరిగే అభివృద్ధి పనుల్లో, విద్యార్థుల ప్రగతిలో తల్లిదండ్రుల్ని భాగస్వాములుగా చేయడానికే ఇటువంటి సమావేశాలు నిర్వహిస్తున్నామని, జిల్లాలో క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పూర్తి అయ్యాయని డీఈవో సీవీ రేణుక వెల్లడించారు. ప్రత్యేక సమావేశాలకు సంబంధించి ఇప్పటికే షెడ్యూల్ ఉపాధ్యాయులకు, హెచ్ఎంలకు అందజేశామని వివరించారు. పండుగ వాతావరణంలో సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు రేణుక బుధవారం "ఆంధ్రజ్యోతి"కి వివరించారు.

పరిశోధనలపై అవగాహన ఒప్పందం


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ ఆచార్య గంగాధరరావు, పీబీ సిద్ధార్థ కళాశాల అధ్యాపకులు

పెదకాకాని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంతో పీబీ సిద్ధార్థ కళాశాల బుధవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు వీసీ ఆచార్య కె.గంగాధరరావు సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ ఒప్పందం వలన పీబీ సిద్ధార్థ కళాశాల, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కంప్యూటర్ సైన్సెస్ విభాగాలు సంయుక్తంగా పరిశోధనలు చేయటం, సాంకేతిక సదస్సులు, సాంకేతిక శిక్షణా కార్యక్రమాలు, పాఠ్య ప్రణాళికలు రూపొందించడం, పరిశోధన, నూతన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని విద్యార్థులకు, అధ్యాపకులకు బోధించటం, వనరులను వినియోగించుకోవడం, వివిధ సంస్థలకు సేవలు అందించి తద్వారా ఆదాయం చేకూర్చటం వంటి అంశాల్లో రెండు కళాశాలలు కలిసి పని చేయాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో పీబీ సిద్ధార్థ కళాశాల ప్రధాన అధ్యాపకులు డాక్టర్ మేకా రమేష్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్సు విభాగ అధిపతి డాక్టర్ టి.ఎస్.రవి కిరణ్, ఉప విభాగ అధిపతి కె.సురేష్ పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

- రూ.8 లక్షల విలువైన 13 వాహనాలు స్వాధీనం


ద్విచక్రవాహనాలను పరిశీలిస్తున్న వెస్ట్ డీఎస్పీ జయరామ్ ప్రసాద్, సీసీఎస్ డీఎస్పీ శివాజీ రాజు

గుంటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా ద్విచక్ర వాహనాల దొంగను నగరంపాలెం పోలీసులు అరెస్టు చేశారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని పురుషోత్తంపట్నంకు చెందిన వల్లెపు సత్యదాసును అరెస్టు చేసి అతని నుంచి సుమారు రూ.8 లక్షల విలువ చేసే 13 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ జయరామ్ ప్రసాద్ వివరాలు వెల్లడించారు. నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనాల అపహరణపై అందిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ సతీష్‌కుమార్ జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించి, క్రైమ్స్ అడిషనల్ ఎస్పీ కె.సుప్రజ పర్యవేక్షణలో సీసీఎస్ డీఎస్పీ ఎ.శివాజీ, వెస్ట్ డీఎస్పీ జయరాం ప్రసాద్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీఎస్ సీఐ సుబ్బారావు, నగరంపాలెం సీఐ వీరా నాయక్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాల దొంగతనాల కేసులపై ప్రత్యేక దృష్టి సారించారు. 150 సీసీ కెమెరాలు పరిశీలించి, సాంకేతిక పరిజ్ఞానంతో వల్లెపు సత్యదాసు అనే అతను దొంగతనాలకు పాల్పడుతున్నాడని గుర్తించారు. అతడిని అరెస్టు చేసి, 13 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్ర వాహనాలను దొంగతనం చేసి, తాకట్టు పెట్టి వాటి ద్వారా వచ్చిన డబ్బుతో తన దురలవాట్లు తీర్చుకునే వాడని విచారణలో తేలిందన్నారు. సీసీఎస్ డీఎస్పీ శివాజీరాజు, నగరంపాలెం సీఐ వీర నాయక్, సీసీఎస్ సీఐ సుబ్బారావు, ఎస్ఐలు రామాంజనేయులు, సలాం, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో స్వల్ప భూ ప్రకంపనలు

తెనాలి, దాచేపల్లి, సత్తెనపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం కొన్ని సెకన్ల పాటు స్వల్పంగా భూమి కంపించింది. బుధవారం ఉదయం 7.30 గంటల సమయంలో రెండుసార్లుగా మూడు నుంచి ఐదు సెకన్ల పాటు కదలికలు కనిపించాయి. తెల్లవారు జామున కట్టేసి ఉంచిన వాషింగ్ మెషిన్లు, ఇతర సామగ్రి కొన్ని సెకన్లపాటు కదలడం, వంట పాత్రల స్టాండ్‌లో శబ్దాలు రావడాన్ని గుర్తించామని ఆయా ప్రాంతాలవాసులు చెప్పారు. గుంటూరు జిల్లా తెనాలిలో కొన్ని ప్రాంతాల్లో భూ అలజడి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. మారీస్‌పేట, చెంచుపేట, సుల్తానాబాద్, అమరావతి ప్లాట్స్, కొలవరం రోడ్డు వెంటున్న నివాసాల్లో ఈ పరిస్థితి ఎదురైంది. పల్నాడు జిల్లా దాచేపల్లిలో బుధవారం ఉదయం 7.40 నిమిషాల సమయంలో 12 సెకన్లు పాటు భూమి కంపించినట్లు నారాయణపురంలోని వైద్యులు సుంకర సత్యనారాయణరెడ్డి తెలిపారు. సత్తెనపల్లిలోని నాగన్నకుంటలో మూడు సెకన్ల పాటు స్వల్పంగా భూమి కంపించిందని ఆ ప్రాంత ప్రజలు, వీఆర్‌వో అరుణ తెలిపారు. ఉదయం 7.25 గంటల తరువాత భూకంపం వచ్చిందని, ఇంట్లో కుర్చీలు, సామాన్లు కొంత పక్కకు ఒరిగాయని కొంత మంది తెలిపారు.

సికింద్రాబాద్, బ్రహ్మపూర్, విశాఖపట్నంకు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పండగల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా సికింద్రాబాద్, బ్రహ్మపూర్, విశాఖపట్నంలకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. నంబరు. 07027 సికింద్రాబాద్ - బ్రహ్మపూర్ ప్రత్యేక రైలు ఈ నెల 6, 13, 20, 27(శుక్రవారం) తేదీల్లో రాత్రి 8.15కి బయలుదేరి సత్తెనపల్లి, గుంటూరు మీదగా శనివారం మధ్యాహ్నం 2.45కి బ్రహ్మపూర్ చేరుకొంటుంది. నంబరు. 07028 బ్రహ్మపూర్ - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 7, 14, 21, 28(శనివారం) తేదీల్లో సాయంత్రం 4.45కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి మీదగా ఆదివారం ఉదయం 11.35కి సికింద్రాబాద్ చేరుకొంటుంది. నంబరు. 07097 సికింద్రాబాద్ - విశాఖపట్నం ప్రత్యేక రైలు ఈ నెల 8, 15, 22, 29(ఆదివారం) తేదీల్లో సాయంత్రం 4.35కి బయలుదేరి సత్తెనపల్లి, గుంటూరు మీదగా సోమవారం ఉదయం 6.30కి విశాఖపట్నం చేరుకొంటుంది. నంబరు. 07098 విశాఖపట్నం - సికింద్రాబాద్ రైలు ఈ నెల 9, 16, 23, 30(సోమవారం) తేదీల్లో రాత్రి 7.50కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి మీదగా మరుసటి రోజు ఉదయం 11.15కి సికింద్రాబాద్ చేరుకొంటుంది.

ఎల్‌హెచ్‌బీ బోగీలతో అమరావతి ఎక్స్‌ప్రెస్

వారంలో నాలుగు రోజులు గుంటూరు మీదగా ప్రయాణించే నంబరు. 18047, 18048 షాలిమార్ - వాస్కోడిగామ - షాలిమార్ అమరావతి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఎల్‌హెచ్‌బీ బోగీలతో ప్రయాణించనున్నాయి. ఈ నెల 16 నుంచి నంబరు. 18047, 19వ తేదీ నుంచి 18048 రైళ్లు ఎల్‌హెచ్‌బీ బోగీలతో ప్రయాణిస్తాయి. దీనివలన కోచ్ కంపోజిషన్ ఒక సెకండ్ ఏసీ, నాలుగు ఏసీ త్రీటైర్, 9 స్లీపర్, నాలుగు జనరల్ బోగీలుగా మారనుంది.

అయ్యప్ప భక్తులకు సేవలు చేయడం మహద్భాగ్యం

● డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి


రోగికి పిండికట్టు వేస్తున్న డాక్టర్ నరేంద్రరెడ్డి

గుంటూరు మెడికల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శబరిమలకు వచ్చే అయ్యప్ప భక్తులకు వైద్య సేవలు అందించడం మహద్భాగ్యంగా భావిస్తున్నానని ప్రముఖ జాయింట్, రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. డిసెంబరు ఒకటో తేదీ నుంచి శబరిమల పంబ వద్ద నాలుగు రోజుల పాటు డాక్టర్ నరేంద్ర రెడ్డి నేతృత్వంలో వైద్య బృందం భక్తులకు వైద్య సేవలు అందిస్తోంది. ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు వైద్యుల ఆహ్వానం మేరకు ఆరుగురు వైద్యులతో కూడిన బృందం పంబ వద్ద ఉన్న దేవస్థానానికి చెందిన వైద్యశాలలో అక్కడకు వచ్చే అయ్యప్ప భక్తులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ మేరకు బుధవారం డాక్టర్ నరేంద్రరెడ్డి ఒక ప్రకటన ద్వారా అక్కడి పరిస్థితులను వివరించారు. శబరిమలలో కురుస్తున్న భారీ వర్షాలతో భక్తులు కొంతమేర ఇబ్బందులకు గురౌతున్నట్లు తెలిపారు. ఆయాసం, దగ్గు, జలుబు, జ్వరంతో బాధపడే భక్తులకు వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. వర్షాల కారణంగా కొండల మీద నుంచి జారిపడి ప్రాక్చర్లకు గురైన వారికి పిండికట్టు వేసి కొట్టాయం జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు వివరించారు.

జనసేన నేతపై దాడి

సత్తెనపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, సీనియర్ న్యాయవాది కొమ్మిశెట్టి సాంబశివరావుపై బుధవారం రాత్రి దాడి జరిగింది. సాంబశివరావు నాగార్జున నగర్‌లోని తన గృహానికి బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు సాంబశివరావుపై కర్రతో దాడి చేసి బైక్‌పై పరారయ్యారు. జరిగిన సంఘటనపై సాంబశివరావు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	98,107,118
చికెన్ విత్ స్కిన్	190.00
చికెన్ స్కిన్ లెస్	200.00

ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ల స్థలాల కోసం వినతి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగర కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ ఉద్యోగులకు ఇంటి స్థలాలు కేటాయించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా కోరారు. ఈ మేరకు కలెక్టర్ ఎస్ నాగలక్ష్మికి బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి కూడా నోచుకుని ఉద్యోగులకు స్థలాలు ఇవ్వాలని కోరారు. కరువు భత్యం, బకాయిలు చెల్లించలేదని, దీనికి తోడు పీఆర్సీ ప్రకటన చేయలేదని దీంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత చికిత్సలను అందించడానికి ఆస్పత్రి యాజమాన్యాలు ముందుకు రావడం లేదని అన్నారు. నెట్‌వర్క్ హాస్పిటల్స్ యాజమాన్యంతో త్వరలోనే సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్టు ఆయన తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘ నాయకుల కరీముల్లా, పోతురాజు, విజయబాబు, వై నాగేశ్వరరావు, సాంబ శివరెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తెలుగు సాహిత్యంపై చెరగని ముద్ర ఆరుద్ర

గుంటూరు(తూర్పు), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తెలుగుసాహిత్యంపై చెరగని ముద్ర వేసిన గొప్పకవి ఆరుద్ర అని అరసం నాయకుడు కోనూరి రవికుమార్ కొనియాడారు. స్థానిక ఏఎల్‌బీఈడీ కళాశాల ఆవరణలో జరుగుతున్న విశాలాంధ్ర పుస్తక మహోత్సంలో ఆలూరి బైరాగి సాహిత్య వేదికపై ఆరుద్ర శత జయంతి సభను నిర్వహించారు. అనంతరం ప్రముఖ సాహితవేత్త డాక్టర్ పరుచూరి విజయలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాదు, జిల్లా కార్యదర్శి బుల్లా రవి తదితరులు పాల్గొన్నారు.

మానసిక దాడి సరికాదు: యూటీఎఫ్

గుంటూరు(విద్య),డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులపై మానసిక దాడి సరికాదని యూటీఎఫ్ జిల్లా నాయకులు అన్నారు. 'టీచర్లపై మానసిక దాడి ఆపండి' యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలోని అన్ని మండలాలలో ఎంఈవోలకు నాయకులు బుధవారం వినతి పత్రాలు అందజేశారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యూ రాజశేఖర్ రావు, ఎం కళాధర్ మాట్లాడుతూ రకరకాల సమాచారం అప్‌లోడ్ చేయాలని ఉపాధ్యాయులపై ప్రతిరోజు ఒత్తిడి చేయడం, ఒకపని పూర్తి కాక ముందే మరోపని పురామాయించడం, ఉపాధ్యాయులకు సెలవు మంజూరు చేయొద్దని ఆదేశాలు ఇవ్వడం తీవ్ర ఒత్తిడికి గురి చేయడమేని అన్నారు. ప్రభుత్వం వైఖరి మార్చుకోని పక్షంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

వాచ్‌మెన్ తొలగింపు వివాదంపై ఎస్సీ,ఎస్టీ కేసు

గుంటూరు, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్డులో ఉన్న అపార్టుమెంట్‌లో గత నెల 8న వాచ్‌మెన్ సామగ్రి బలవంతంగా బయటపడేసి ఖాళీ చేయించిన కేసులో నల్లపాడు పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు హనుమాన్ నగర్ ఒకటో లైన్‌లోని ఓ అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్ విషయమె అపార్టుమెంట్ వాసుల మధ్య వివాదం తలెత్తింది. ఈ క్రమంలో ఆ అపార్టుమెంట్‌లో నివసించే మహిళ సులోచన దేవిని అదే అపార్టు మెంట్‌లో ఉంటున్న నాగేశ్వరరావు, శిల్ప, జయరాజు, అంజనీ, పద్మ తదితరులు కులం పేరిట దూషించారు. ఇదే విషయమై గత సెప్టెంబరులో కూడా సులోచనను కులం పేరిట కమిటీ సభ్యులు రెండు సార్లు ఆమెను దూషించారు.

విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసం.. కేసు నమోదు

విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి రూ 55 లక్షలు తీసుకొని మోసం చేసిన వారిపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం విద్యానగర్‌లో ఉంటున్న అంకిరెడ్డిపాలెం చెందిన అల్లు శ్రీకాంత్ రెడ్డి కన్సల్టెన్సీ నిర్వ హిస్తున్నారు. కొరిటెపాడుకు చెందిన జొన్నల విజయసింహారెడ్డి లండన్ లో ఉంటున్నారు. 2020లో శ్రీకాంత్‌రెడ్డి తన వద్దకు వచ్చిన ఇద్దరిని విజయసింహారెడ్డి వద్దకు పంపగా వారి వద్ద డబ్బులు తీసుకొని ఉద్యోగాలు ఇప్పించాడు. దీంతో 2023లో మరో నలుగురు యువకులను జయసింహారెడ్డి చెప్పిన విధంగా ఆయన తల్లి నర్మదా, బావ కృష్ణారెడ్డి వద్దకు పంపాడు. ముగ్గురు కలిసి నలుగురు బాధితులు వద్ద నుంచి రూ. 55 లక్షలు తీసుకున్నారు. అయితే వారిని విదేశాలకు పంపకుండా మోసం చేయడంతో శ్రీకాంత్ రెడ్డి ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పదిమంది పేకాటరాయుళ్లు అరెస్టు

స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని సిద్ధార్థనగర్‌లో పది మంది పేకాటరాయుళ్ళను పోలీసులు అరెస్టు చేశారు. సాయి గ్రాండ్ అతిథి గృహంలో పేకాడుతున్న పది మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి లక్షా 50 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వీరేంద్రబాబు తెలిపారు.

గంజాయి సరఫరాదారుడు అరెస్ట్

ఒడిస్సా నుంచి ఇటీవల పెద్ద మొత్తంలో ఏపీకి గంజాయి సరఫరా చేసిన కేసులో ప్రధాన నిందితుడిని పట్టాభిపురం పోలీసులు అరెస్ట్ చేశారు. ఇటీవల 25 మంది గంజాయి ముఠా సభ్యుల నుంచి భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. వారికి ఒరిస్సా నుంచి గంజాయి సప్లై చేసిన టీమ్ అనే ప్రధాన నిందితుడిని బుధవారం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ రిమాండ్ విధించడంతో ఆయనను జైలుకు తరలించారు.

చోరీ కేసులో ప్రధాన నిందితుడు అరెస్ట్

స్థాయికి పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రమౌళినగర్‌లో విశ్రాంత అదనపు ఎస్పీ పెంచలనాయుడు ఇంట్లో చోరీ కేసులో ప్రధాన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ముంబైకి చెందిన సలీం హబీబ్ ఖురేషిని అరెస్ట్ చేసి ఆయన వద్ద నుంచి 200 గ్రాముల బంగారు ఆభరణాలు, కిలో వెండి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు. ఇదే కేసులో మరో నిందితుడు శాబీర్ ఖురేషి పరారీలో ఉన్నాడు.

రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ఏర్పాట్లు చేశాం

● మంత్రి అనగానికి నివేదించిన కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6 నుంచి జనవరి 8 వ తేదీ వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సులకు అన్ని ఏర్పాట్లు చేపట్టామని రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాదుకు కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణ నేపథ్యంలో బుధవారం మంగళగిరిలోని సీసీఎల్ఏ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని 173 గ్రామాలకు గాను తొమ్మిది మండలాల్లోని 62 గ్రామాల్లో రీ సర్వే పూర్తి అయినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని రకాల భూ వివాదాలకు పరిష్కారం నిమిత్తం రాష్ట్ర వ్యాప్తంగా 17,564 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం భూవివాదాల పరిష్కారానికి ఎటువంటి ప్రయత్నం చేయకపోగా వారి స్వార్థం కోసం, భూములను ప్రజల నుంచి లాగేసుకునేందుకు మరిన్ని సమస్యలు సృష్టించారని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో భూ వివాదాలు నెలకొన్నాయని, వీటిని పరిష్కరించి సామాన్య ప్రజలకు న్యాయం చేసే ఉద్దేశ్యంతో సీఎం చంద్రబాబునాయుడు ఎప్పటికప్పుడు రెవెన్యూ అంశాలపె సమీక్షిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ప్రజల సమస్యలను తీర్చేందుకు రెవెన్యూ సదస్సులు కూడా నిర్వహించాలని నిర్ణయించామని, ఈ నెల 6న సదస్సులు ప్రారంభమై 33 రోజులు రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో జరుగుతాయన్నారు. రెవెన్యూ సదస్సులు సజావుగా నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌ని మంత్రి ఆదేశించారు.

రాష్ట్ర రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు ప్రతి రోజు ఉదయం 9 గంటలకు రెవెన్యూ గ్రామంలో నిర్దేశించిన ప్రదేశంలో నిర్వహించాలని తెలిపారు. ఈ సదస్సుల సందర్భంగా సంబంధిత శాఖల అధికారుల బృందం ప్రతి రెవెన్యూ గ్రామాన్ని సందర్శించి ఫ్రీహోల్డ్, సెక్షన్ 22(ఏ)కు సంబంధించిన భూఆక్రమణ సమస్యలతో ప్రభావితమైన వారి నుంచి ముందస్తు సమాచారంతో వినతులను స్వీకరించడం జరుగుతుందన్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జిల్లా షెడ్యూల్‌ను ఖరారు చేసి, గ్రామ,మండల స్థాయి పిటిషన్ల స్వీకారం, పరిష్కార విధానాన్ని పర్యవేక్షించి సకాలంలో వాటి పరిష్కారానికి చర్యలు తీసు కుంటారని తెలిపారు. రెవెన్యూ సదస్సుల సందర్భంగా స్వీకరించే ఫిర్యాదులన్నింటిని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ రూపొందించిన గ్రీవెన్స్ రిడ్రెసల్ పోర్టల్లోని ప్రత్యేకవిండోలో ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో గుంటూరు కలక్టరేట్ నుంచి సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, రెవెన్యూ డివిజనల్ అధికారి కే శ్రీనివాస రావు పాల్గొన్నారు.



మంత్రి అనగాని నిర్వహించిన వీసీకి హాజరైన కలెక్టర్, జేసీ

సురక్షిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయండి

● హోం మంత్రి అనితతో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

జిల్లాలో భారీ వర్షాలు, వరదలు వంటి విపత్తుల సమయంలో లంక గ్రామాలు, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలతో పాటు పశువులను సురక్షిత ప్రాంతాల్లోకి తరలించేలా ముందస్తుగా షెల్టర్ల ఏర్పాటు అవసరం ఉందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితకు కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు. హోం మంత్రి సచివాలయం నుంచి రాష్ట్రంలో విపత్తుల నిర్వహణపై బుధవారం కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణానదికి వరదలు వచ్చినప్పుడు జిల్లాలోని లంక గ్రామాల్లో ప్రజలు రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేసినా, జిల్లా యంత్రాంగం హెచ్చరించినా గ్రామాల్లో పశువులను వదిలి పునరావాస కేంద్రాలకు రావడానికి ఆసక్తి చూపడం లేదన్నారు. రక్షిత ప్రాంతాల్లో షెల్టర్లు ఏర్పాటు చేసి పశువులను ముందుగా తరలిస్తే ప్రజలు పునరావాస కేంద్రాలకు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. గ్రామాల్లో వరద ముంపు సమయంలో ప్రమాద హెచ్చరికలు చేస్తూ నిరంతరం సైరన్ మోగించేలా ఏర్పాట్లు చేయడం ద్వారా ప్రజలలో కొంత అవగాహన కలిగి పునరావాస కేంద్రాలకు రావడం జరుగుతుందన్నారు. వరద సమయంలో సహాయ కార్యక్రమాలకు అవసరమైన లైఫ్ జాకెట్లు, రోప్స్, అస్కా లైట్లు, లైఫ్ బోట్లు తదితర సామగ్రిని అగ్నిమాపక శాఖకు అందించితే ప్రాథమికంగా సహాయ చర్యలు చేపట్టడానికి ఉపయోగంగా ఉంటుందన్నారు. ఇప్పటికే ప్రతిపాదనలు రాష్ట్ర కార్యాలయానికి అందించినట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న 67 రెయిన్ గేజ్‌లలో 29 పనిచేయడం లేదని వాటికి మరమ్మతులు చేయించాలని, జిల్లాలో పడవల లభ్యత తక్కువగా ఉందని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జిల్లా విపత్తుల నిర్వహణ ప్రాజెక్టు మేనేజరు లక్ష్మీ కుమారి పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ది కీలకపాత్ర



నూతనంగా నిర్మించిన బ్యారక్‌ను ప్రారంభిస్తున్న ఐజీ త్రిపాఠి, పక్కన ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ది కీలక భూమిక అని రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అన్నారు. స్పెషల్ టాస్క్‌ఫోర్స్(ఎస్‌టీఎఫ్)సిబ్బంది కోసం నగరం పాలెం పోలీస్ స్టేషన్ పక్కన గల ఎస్టీఎఫ్ కార్యాలయంపై నూతనంగా నిర్మించిన బ్యారక్‌ను ఐజీ, ఎస్పీ సతీష్ కుమార్ బుధవారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు జీవి రమణమూర్తి, హనుమంతు, డీఎస్పీలు సీతారామయ్య, రమేష్, సీఐ వీర నాయక్ , శ్రీహరి రెడ్డి, ఉదయ భాస్కర్, శివరామకృష్ణ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందికి సత్కారం



ఉద్యోగ విరమణ చేసిన పోలీస్ సిబ్బందిని సత్కరిస్తున్న ఎస్పీ, అదనపు ఎస్పీ

గుంటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కాలం పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు విశేషసేవలందించి ఉద్యోగ విరమణ పొందిన ఎస్సైలు డేవిడ్ రాజు . రాధాకృష్ణ మూర్తి సేవలు అభినందనీయమని ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అదేవిధంగా ఇంటిలిజెన్స్ విభాగానికి బదిలీపై వెళుతున్న ఏఆర్ డీఎస్పీ శాంతి కుమార్‌ను కూడా ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు జీవీ రమణమూర్తి, హనుమంతు, ఎస్‌బీ డీఎస్పీ సీతారామయ్య ఏఆర్‌డీఎస్పీ ఏడుకొండలు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరగాయకుడు ఘంటసాలకు నివాళి



ఘంటసాల విగ్రహానికి నివాళులర్పిస్తున్న కళాదర్బార్ సభ్యులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల వెంకటేశ్వరరావు పాటలు అన్ని తరాలను అలరిస్తాయని కళా దర్బార్-అమరావతి సంస్థ వ్యవస్థాపక అధ్య క్షుడు పొత్తూరి రంగారావు కొనియాడారు. ఘంటసాల జయం తిని పురస్కరించుకుని స్థానిక నాజ్ సెంటరులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనం తరం రంగారావు మాట్లాడుతూ నేటి తరం యువత కూడా ఘంటసాల పాటలను ఆదరించడం గొప్ప విషయమన్నారు. దాదాపు మూడు వేలపాటలు ఆల పించిన ఘంట సాల విదేశాల్లో కూడా ఆదరణ పొందిన విషయాన్ని ప్రస్తావించారు. ఎం. ప్రసాదరావు, కే బాబురావు, టీ సుధీర్‌బాబు, టీ రమేష్, నందిని, రాజశేఖర్, జమదగ్ని పాల్గొన్నారు.

ఘంటసాల స్వరం తెలుగువారికి వరం

గుంటూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మధుర గాయకుడు ఘంటసాల స్వరం తెలుగువారికి దేవుడిచ్చిన వరం అని ఆంధ్ర మేధావుల ఫోరం కన్వీనర్ పీఎస్ మూర్తి తెలిపారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాల పాటు తెలుగు సినీ సంగీత ప్రపంచపటంలో మకుటం లేని మహరాజులా వెలుగొందారన్నారు. ఘంటసాల పాట నిత్యం వింటూనే ఉంటారన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ఘనశ్యామాచార్యులు, వీఎస్ఎన్ మల్లేశ్వర రావు, రాజశేఖర్, కమలకుమారి, సాయి, సాంబయ్య తదితరులు ఉన్నారు.

రేపు జాతీయ మానవహక్కుల కమిషన్ చైర్‌పర్సన్ రాక

గుంటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ మానవహక్కుల కమిషన్ యాక్టింగ్ చైర్‌పర్సన్ విజయ భారతి సయాని ఈ నెల 6 న జిల్లా పర్యటనకు రానున్నారు. ఆమె శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు గుంటూరుకు చేరుకొని ఆకస్మిక తనిఖీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌కు సమాచారం అందింది.

పారిశుధ్యం, రోడ్ల నిర్వహణపై జైపూర్ కమిషనర్‌తో చర్చ



జైపూర్ లో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజస్థాన్ లోని జైపూర్ మున్సిపల్ కార్పోరేషన్ స్టడీ టూర్ లో భాగంగా బుధవారం జైపూర్ గ్రేటర్ మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ రుక్మిణి రియార్ తో గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మర్యాద పూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జైపూర్‌లో రోడ్ల నిర్వహణ, పారిశుధ్య పనులు, హోర్డింగ్స్ పాలసీ, కేబుల్ వైర్ల తొలగింపు, డంప్ యార్డులను పార్క్ లుగా అభివృద్ధి చేయడం వంటి పలు అంశాలను చర్చించారు. అనంతరం కమిషనర్ బృందం జైపూర్ నగరంలో క్షేత్ర స్థాయిలో వివిధ వార్డులను నేరుగా పరిశీలించి, స్థానికులు, అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కమ్యూనిటీ కంపోస్టింగ్ లో భాగంగా స్థానికులు ప్రతాప్ అగర్వాల్ మట్టి కుండల ద్వారా మట్కా కంపోస్టింగ్ చేసే విధానాన్ని పరిశీలించి ప్రత్యేకంగా అభినందించారు. సులబ్ నిర్వహిస్తున్న పబ్లిక్ టాయ్ లెట్స్ ని పరిశీలించి చాలా పరిశుభ్రంగా నిర్వహించడం, అందులో శానిటరీ న్యాప్ కిన్స్ వెండింగ్ మెషిన్ కూడా ఉండడం, ఉపయోగించిన న్యాప్ కిన్లను దహనం చేయడానికి యంత్రాలు ఉండటం పరిశీలించారు. ఆర్‌ఆర్‌ఆర్ యూనిట్‌ని పరిశీలించి, అక్కడి ఏర్పాట్లను గమనించారు. జైపూర్ డెవలప్‌మెంట్ అథారిటీ నిర్వహిస్తున్న మసాలా చౌక్, ఫుడ్ కోర్టులను పరిశీలించి, అక్కడి పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణపై సిబ్బందిని ప్రశంసించారు. స్థానిక బల్క్ వేస్ట్ జనరేటర్ హెరిటేజ్ గ్రాండ్ యునియారా హోటల్‌లో ట్రీట్‌మెంట్ ప్లాంట్, హోటల్ నిర్వహణ, తడి వ్యర్థాలను మీథేన్ బయో గ్యాస్‌గా ప్రాసెస్ చేసే విధానాన్ని పరిశీలించారు.

188 మంది సచివాలయ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబర్ 4(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో 188 మంది వార్డ్ సచివాలయ కార్యదర్శులకు షోకాజ్ నోటిసులు జారీ చేసినట్లు జీఎంసీ కమిషనర్ ఎ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు విధిగా బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేయాలని, వరుసగా 13 రోజులు పాటు బయోమెట్రిక్ నమోదు చేయని కార్యదర్శులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఉమెన్, వీకర్ సెక్షన్ ప్రొటెక్షన్ కార్యదర్శులు 13, వెల్ఫేర్ 8, ఎడ్యుకేషన్ 35 , అడ్మినిస్ట్రేషన్ 26, ఎమినిటిస్ 46, శానిటేషన్ 17, రెవెన్యూ 32, హెల్త్ 11 మంది కార్యదర్శులకు నోటీసులు జారీ చేశారు.

సకాలంలో పన్ను చెల్లించకపోతే చర్యలు

గుంటూరు నగరపాలక సంస్థకు సకాలంలో పన్నులు చెల్లించని వారి నివాసాలు, వ్యాపార సంస్థలకు తొలుత ట్యాప్ కనెక్షన్‌లు తొలగిస్తామని, అప్పటికీ చెల్లించకుంటే చట్టపరమైన చర్యలు తీసు కుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక శ్రీనివాసరావుతోట, నల్లపాడు రోడ్డు, ఆదర్శనగర్, నల్లచెరువు తదితర ప్రాంతాల్లో ఆస్తి, నీటి పన్నులు చెల్లించని నివాసాలకు, కమర్షియల్ సంస్థలకు మున్సిపల్ ట్యాప్ కనెక్షన్‌ని రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో ఇంజినీరింగ్ సిబ్బంది తొలగించారు. పన్ను చెల్లించకుండా నిర్లక్ష్యంగా ఉండే వారికి మున్సిపల్ ట్యాప్ కనెక్షన్, డ్రైనేజి కనెక్షన్ తొలగించడంతో పాటు విద్యుత్ కనెక్షన్ తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. నల్లకుంట ఎదురు ఉన్న తాజ్ హోటల్ కి అనధికారికంగా ఉన్న మున్సిపల్ ట్యాప్‌ని తొలగించినట్లు పేర్కొన్నారు.

'స్వర్ణ పంచాయతీ' సమర్థంగా నిర్వహించాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణ పంచాయతీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి బీ నాగసాయికుమార్ అన్నారు. గుంటూరు రూరల్ మండలంలో వెంగళాయపాలెంలో జరుగుతున్న స్వర్ణ పంచాయతీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల మ్యాపింగ్, గ్రామంలో ఉన్న సదుపాయాలు, అందుతున్న సంక్షేమ పథకాలు, ఇతర వివరాలను తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు. అనంతరం గ్రామంలో ఉన్న ఘన వ్యర్థాల కేంద్రంలోని వర్మీ కంపోస్టు తయారీలో వానపాములను వదిలారు. ఈవోపీఆర్డీ కే శ్రీనివాసరావు, సర్పంచ్ లలిత కుమారి, ఉపసర్పంచ్ మాధవీలత, పంచాయతీ కార్యదర్శి రవి పాల్గొన్నారు.

గుంటూరులో మరో వైసీపీ నేత రాసలీలలు

● మహిళపై వైసీపీ జడ్పీటీసీ అత్యాచారం
● పెళ్లి పేరిట పలుమార్లు బలాత్కారం
● అప్పుగా తీసుకున్న రూ.50 లక్షలు ఇవ్వకుండా బెదిరింపులు
● ఎస్పీని ఆశ్రయించిన బాధితురాలు

గుంటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు రూరల్ మండలం వెంగళాయ పాలెంకి చెందిన వైసీపీ నాయకుడు దేవరకొండ నాగేశ్వరరావు ఓ మహిళను బెదిరించి అత్యాచారం చేసిన ఘటన విదితమే. ఈ ఘటన మరవకముందే మరో వైసీపీ నాయకుడి రాసలీల ఘటన వెలుగు చూసింది. వైసీపీ జడ్పీటీసీ తనపై బలాత్కారం చేశారని ఆరోపిస్తూ ఓ మహిళ ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. తనపై జడ్పీటీసీ పలు దఫాలు అత్యాచారం చేశాడని బాధిత మహిళ ఫిర్యాదు ఆలస్యంగా వెలుగు చూసింది. తనపై బలాత్కారం చేసిన విషయాన్ని గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని చెప్పడంతో 'ఎవరికి చెప్పొద్దని... నిన్ను ప్రేమిస్తున్నాను, పెళ్లి చేసుకుంటాను' అంటూ ఆమెను నమ్మించి పలుమార్లు తనను బలాత్క రించాడని ఆరోపిస్తూ ఆమె తన ఫిర్యాదులో పేర్కొంది. అంతేగాక, ఆ జడ్పీటీసీ రాజకీయ, వ్యాపార అవసరాల కోసం తన వద్ద అప్పుగా తీసుకున్న రూ. 50 లక్షలు తిరిగి ఇవ్వకపోగా 'నీకు చేతనైంది చేసుకో'అని బెదిరించాడని ఆమె ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిందిగా నల్లపాడు పోలీసులను పోలీసు అధికారులు ఆదేశించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వివరాలు.. గుంటూరు రూరల్ మండలం చిన్న పలకలూరుకి చెందిన మహిళకు, గుంటూరుకు చెందిన వ్యక్తికి గతంలో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు. 2001లో ఆమె భర్త మృతి చెందాడు. దీంతో 2004లో ఆమె తన కుటుంబంతో సహా చిన్న పలకలూరులోని పుట్టింటికి చేరింది. గుంటూరులో భర్త తరఫున వచ్చిన ఆస్తిని అమ్ముకొని చిన్న పలకలూరు లో బట్టలు వ్యాపారం చేస్తూ ఆ తరువాత, చీటీలు కట్టుకుంటూ వస్తోంది.

ఈ క్రమంలో 2007 నుంచి అప్పట్లో కాంగ్రెస్‌లో ఉన్న ఓ నాయకుడు ఆమె వద్ద డబ్బులు అప్పు తీసుకొని తిరిగి చెల్లిస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో 2015లో ఆమె నుంచి ఏకంగా రూ. 50 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఈ విధంగా వారి మధ్య ఆర్థిక లావా దేవీలు కొనసాగుతున్న క్రమంలో తనకు పెళ్లి కాలేదని, పెళ్లి చేసుకుంటానని, ప్రేమిస్తున్నానంటూ ఆమెను నమ్మించే ప్రయత్నం చేశాడు. అయితే, అందుకు ఆమె ఒప్పుకోలేదు. ఈ క్రమంలో 2018లో ఓ రోజు డబ్బుల విషయమై మాట్లాడేందుకు వచ్చిన వైసీపీ నేత, ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆమెపై అత్యాచారం చేశాడు. ఈ విషయాన్ని గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని ఆమె చెప్పగా, ఎవరికి చెప్పొద్దని ఆమెను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. ఈ విధంగా ఆమెను పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెబుతూ ఆమెపై పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడ్డాడు.పెళ్లి చేసుకోమని ఆమె ఒత్తిడి చేస్తుండటంతో కాలయాపన చేస్తూ వచ్చాడు. తనను పెళ్లి చేసుకోకుంటే జరిగిన విషయం గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని అతనితో ఆమె చెప్పింది. జరిగిన విషయం ఎవరికైనా చెబితే ఆమెను, పిల్లలను చంపేస్తానని బెదిరించాడు.

ఇదిలా ఉంటే గత నెల 2న జడ్పీటీసీ కారులో మరో మహిళతో చిన్న పలకలూరులోని బాధితురాలు ఇంటి ముందుగా వెళ్తుండగా ఆ వాహనాన్ని ఆమె అడ్డుకొని తన పెళ్లి విషయం గురించి నిలదీసింది. దీంతో రెచ్చిపోయిన జడ్పీటీసీ తన కామవాంఛ తీర్చుకోవడం కోసమే ప్రేమిస్తున్నట్లు అబద్ధం చెప్పానని అన్నాడు. ఆ కారులో ఉన్న మహిళ తాను జడ్పీటీసీ భార్యనని, డబ్బు కోసమే ఆ విధంగా మాయమాటలు చెప్పాడని, తన భర్తను తాను ప్రోత్సహించినట్లు ఆమె ఒప్పుకుందని ఆ ఫిర్యాదులో పేర్కొంది. తన భర్త ఎంతమందితో నైనా తిరుగుతాడని, ప్రస్తుతం జంగంగుంట్లపాలెంకు చెందిన మరో మహిళతోనూ సంబంధం కొనసాగిస్తున్నాడని ఆమె చెప్పిందని ఆ ఫిర్యాదులో తెలిపింది. తనపై పలుమార్లు బలాత్కారం చేసిన వైసీపీ జడ్పీటీసీ, ఆయన భార్యపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుని, తన నుంచి తీసుకున్న రూ 50 లక్షలు ఇప్పిం చాలని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది.



ఆర్ అండ్ బీ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

రహదారుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

● ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

గుంటూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వేమూరు నియోజకవర్గ పరిధిలో రహదారుల మరమ్మతులు, అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని మాజీమంత్రి, వేమూరు శాసనసభ్యుడు నక్కా ఆనందబాబు అధికారులను ఆదేశించారు. గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన ఆర్ అండ్ బీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలనియోజకవర్గంలోని రోడ్లని బాగుచేయడానికి ప్రణాళిక సిద్ధం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్ అండ్ బీ డీఈ, ఏఈలు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

మెప్మా అక్రమాలపై ఉక్కు పాదం మోపుతాం: ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బోగస్ గ్రూపులతో పేదల డబ్బులు తిన్న సీవోలు, ఆర్పీల అక్రమాలపై ఉక్కుపాదం మోపుతామని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి హెచ్చరించారు. గుంటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీవోలతో బుధవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళలకు ఉపాధి కల్పించడమే తమ లక్ష్యమని, కానీ వారి స్వావలంబనను దెబ్బతీసేలా మహిళా సంఘాల నిధుల విషయంలో అనేక అక్రమాలు వెలుగు చూస్తున్నాయని ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు బాధ్యులైన మెప్మా అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గత ఐదేళ్లలో భారీగా అక్రమాలు జరిగాయని గుర్తిస్తున్నామని, ఇందులో ఎవరెవరి పాత్ర ఉందో గుర్తించి చర్యలు చేపడతామని హెచ్చరించారు. పలు డివిజన్లలో 100 డ్వాక్రా గ్రూపులు ఉన్నాయని చెబుతున్న సీవోలు 20 మాత్రమే పేర్లు చూపిస్తున్నారని, మిగిలిన 80 గ్రూపులు బోగస్ గ్రూపులేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్పీలతో కలిసి బోగస్ గ్రూపులను ఏర్పాటు చేసి లక్షలు దండుకున్న వారిని గుర్తించి శిక్షిస్తామని హెచ్చరించారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న మహిళలను గ్రూప్ లుగా ఏర్పాటు చేసి అధిక మొత్తంలో రుణాలు ఇచ్చే బ్యాంకులలో రుణాలు తీసుకున్న విషయాన్ని కూడా గుర్తించామన్నారు. నియోజకవర్గ పరిధిలో ఇలాంటివి ఎక్కడ కనిపించకూడదని హెచ్చరించారు. ఆర్పీలు డబ్బులు డిమాండ్ చేస్తే డ్వాక్రా మహిళలు తనను నేరుగా సంప్రదించాలని ఎమ్మెల్యే సూచించారు.



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

ప్రతి డివిజన్‌నూ మోడల్‌గా తీర్చిదిద్దుతాం: ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌నూ మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే నసీర్ స్పష్టం చేశారు. 7, 11, 15, 17 డివిజన్లలో 1.31 కోట్ల అంచనాలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. గొలుసు కొండలరావు నగర్‌లో రూ.38.50 లక్షలతో సీసీ రోడ్డు, ఒకటో లైన్‌లో రూ.40 లక్షలతో సీసీ డ్రెయిన్, 3, 4, 6 లైన్లలో రూ. 53 లక్షలతో సీసీ రోడ్డు, రూ. 9 లక్షలతో జున్ను షాహిద్ నగర్ మెయిన్ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలను గుర్తించి పనిచేస్తున్నామని, క్షేత్రస్థాయిలో ప్రజలకు కావా ల్సిన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలు నివసించే ప్రాంతంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా సీసీ రోడ్లు డ్రైన్‌లు నిర్మించి వార్డులు అభివృద్ధి చేసి మోడల్ వార్డుగా మారుస్తామని హామీ ఇచ్చారు. 50-100 గజాలలో ఇల్లు కట్టుకునే పేదవారిని టౌన్ ప్లానింగ్ అధికారులు ఇబ్బంది పెడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎల్లావుల అశోక్, షాజీలా, ఉస్మాన్, జమీర్, గాలి సతీష్, అనిల్, సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నాటకరంగాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత

గుంటూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నాటక రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ చెప్పారు. ఉషోదయ కళానికేతన్ 18వ వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఉషోదయ కళానికేతన్ సంస్థలో నటించిన నటీనటులను ఆయన సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాటకాల అభివృద్ధికి ఉషోదయ కళానికేతన్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. భారతీయ సంస్కృతిలో భాగమైన కళలను అంతరించిపోకుండా కాపాడుకున్న సంస్థలకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత సమాజంలో కూడా నాటక రంగం ద్వారా అనేకమంది సేద తీరుతున్నారనడంలో అతిశయోక్తి లేదదన్నారు. అనంతరం సంస్థ వారు మన్నవ మోహనకృష్ణను సన్మానించారు.

రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్న కూటమి ప్రభుత్వం

గుంటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో దారితప్పిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలోపెట్టి అభివృద్ధి బాట పట్టించేందుకు కూటమి ప్రభుత్వం ఆరు నెలలుగా శ్రమిస్తోందని జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక లాడ్జి కూడలిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి రాజధాని, పోలవరం నిర్మాణం, రైతులకు సకాలంలో సహాయ సహకారాలు అందించడం, రహదారులను బాగుచేసే విషయం వంటి ప్రతి అంశంలో రాష్ట్రాన్ని గాడిన పెట్టే విధంగా కూటమి ప్రభుత్వం శ్రమిస్తోందన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను సరి చేసుకుంటూ రాష్ట్రాన్ని సుపరిపాలన వైపు నడిపిస్తున్న కూటమి ప్రభుత్వంపై బురద చల్లేందుకు వైసీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాకినాడ పోర్టు సందర్శన అంశంపై మాజీ మంత్రులు అంబటి, పేర్ని నాని పిచ్చి ప్రేలాపనలు తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రేషన్ మాఫియా ఆట కట్టించేందుకు పవన్‌తో పాటు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గట్టిగా కృషి చేస్తున్నారని అన్నారు. కాకినాడ పోర్ట్ వాటాల విషయంలో నమోదు చేసిన కేసులో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రధాన నిందితుడిగా చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో జనసేన నాయకులు అడపా మాణిక్యాలరావు, శిఖా బాలు, చట్టాల త్రినాథ్, మధులాల్, యడ్ల వెంకటేశ్వరరావు, డొంకెన మురళీ, గోపిశెట్టి సాయి తదితరులు పాల్గొన్నారు.

భక్తులు సమకూర్చిన వివిధరూపాల వాహనాలు



గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రాజధాని అమరావతిలోని వెంకటపాలెం వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో 25 ఎకరాల్లో వెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించిన విషయం తెలిసిందే. అయితే, ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రావడం ఆలయానికి ఒక ప్రాకారం మాత్రమే నిర్మించింది. తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి రావడంతో ఈ ఆలయం అభివృద్ధి పనులు పూర్వపు ప్లాన్ ప్రకారమే తిరిగి ప్రారంభం కానున్నాయి.



నిర్మితమై పూజలందుకుంటున్న వెంకటపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయం



వెంకటపాలెం వెంకటేశ్వర స్వామి ఆలయ మాడ వీధులు



ఆలయం ఆవరణలో శ్రీవారి తులాభారం

శ్రీవారి ఆలయానికి.. మహార్దశ

తుళ్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వంలో సూచించిన ప్లాన్ ప్రకారమే తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఆధ్వర్యంలో మండలంలోని వెంకటపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణపు అభివృద్ధి పనులు జరగనున్నాయి. ఇప్పటికే ఈ ఆలయం నిర్మాణం జరిగి భక్తులకు స్వామి వారి దర్శనం లభిస్తున్న సంగతి తెలిసిందే. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో సీడ్ రోడ్డుకి ఆనుకొని 25 ఎకరాలు ఆలయ నిర్మాణానికి కేటాయించి శంకస్థాపన చేశారు. పనులు మొదలు పెట్టారు. అందుకు రూ.134 కోట్లు టీటీడీ తరపున కేటాయించింది. ఎన్నికల సమీపించడంతో ఆ నిర్మాణపు పనులు ఆగిపోయాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఒక ప్రాకార నిర్మాణాన్ని రూ.32 కోట్లతో చేపట్టి పూర్తి చేసి 'మమ' అనిపించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో పూర్వపు ప్లాన్ ప్రకారమే ఆలయ అభివృద్ధి పనులు చేసేందుకు టీటీడీ సిద్ధమవుతోంది. ఈ ప్లాన్ ప్రకారం నాలుగు ప్రాకారాలను ఏర్పాటు చేయనున్నారు. 25 ఎకరాలలో రెండు ఎకరాలు ఆలయ నిర్మాణానికి, మిగిలిన 23 ఎకరాలో కోనేరు, అర్చకులు, స్టాఫ్ క్వార్టర్లు వాహన మండపం, స్వామి అర్చనకు పూలతోట, గెస్ట్ హౌస్‌లు కడుతున్నట్లు టీటీడీ అధికారులు చెబుతున్నారు. 25ఎక రాల చుట్టూ ప్రహరీ నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. దర్శనానికి పెరుగుతున్న భక్తుల సంఖ్య స్వామి దర్శనానికి రోజు రోజుకు భక్తుల సంఖ్య పెరుగుతోంది. బస్సు సౌక ర్యం కూడా ఆర్టీసీ కల్పించింది. ప్రతి రోజూ అన్నదానం కార్యక్రమాన్ని దాతల సహకారంతో టీటీడీ నిర్వహణలో జరుగుతోంది.

నిర్మాణపు పనులకు అడ్డుగా ప్రధాన వాటర్ ప్లాంట్

స్వామి వారి ఆలయం ఆవరణలో ఎన్టీఆర్ సుజల పథకం ప్రధాన వాటర్ ప్లాంట్ ఉంది. ఇక్కడ నుండే రాజధాని గ్రామాలకు శుద్ధ జలం వాటర్ ట్యాంకులతో పంపిణీ చేస్తున్నారు. టీటీడీకి భూమిని కేటాయించక ముందే అప్పటి సీఎం చంద్రబాబునాయుడు ఈ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. శ్రీవారి ఆలయ నిర్మాణానికి అనుకూలమైన స్థలమని ఎన్టీఆర్ సుజల పథకం ప్లాంట్ ఉన్న ప్రదేశంలో 25 ఎకరాలు టీడీపీ ప్రభుత్వమే కేటాయించింది. ఇప్పుడు ఆలయ అభివృద్ధి పనులకు సుజల పథకం వాటర్ ప్లాంట్ అడ్డుగా ఉండటంతో

- పూర్వపు ప్లాన్ ప్రకారమే పనులు
- పనులకు అడ్డుగా 'సుజల' ప్రధాన వాటర్ ప్లాంట్
- వేరేచోటుకు త్వరగా మార్చాలంటున్న టీటీడీ అధికారులు

దీనిని మరోచోటుకి తరలించాలని ప్రభుత్వానికి టీటీడీ తెలియజేసింది. ఆలయ అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభంకానున్న నేపథ్యంలో దీనిని వేరేచోటుకు ఎంత తొందరగా మారిస్తే అంత తొందరగా పనులు ప్రారంభమవుతాయని టీటీడీ చెబుతోంది.



వెంకటపాలెం వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం



ఆలయ ప్రవేశ ముఖద్వారం



విశాలమైన పార్కింగ్

అట్లాంటా మహాలక్ష్మి దేవస్థానానికి బంగారు కమలాలు



వేమూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా నియోజకవర్గ కేంద్రమైన వేమూరులోని సత్య శిల్పశాల శిల్పులు దేవుమయాచార్య, నాగమయ నారాయణచార్య తయారు చేసిన బంగారు కమలాలను అట్లాంటా మహాలక్ష్మి దేవస్థానానికి బుధవారం పంపారు. దేవస్థానం ట్రస్టు ఇచ్చిన ఆర్డర్‌పై అమ్మ వారికి బంగారు కమలాలను తమ ప్రతిభను చాటుతూ అత్యంత సుందరంగా మలిచారు. ఒక్కొక్క కమలం 33 గ్రాములు చొప్పున మూడు కిలోల 600 గ్రాముల బంగారంతో 108 బంగారు కమలాలను తయారు చేశారు. రూ.2.25 కోట్ల విలువ చేసే కమలాలను ట్రస్ట్ సభ్యుల ద్వారా అట్లాంటా దేవస్థానానికి పంపారు. అతి సుందరంగా కమలాలను తయారు చేసిన శిల్పులకు ట్రస్ట్ సభ్యులు అభినందనలు తెలిపారు.



శిల్పులు దేవుమయాచార్య, నాగమయ నారాయణచార్య

బీసీ కార్పొరేషన్‌కు... 'రుణ' కళ

- లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు

(5వ పేజీ తరువాయి)

ముఖ్యంగా ఆదరణ పథకం, వెనకబడిన తరగతుల అభివృద్ధి కార్పొరేషన్ కింద రుణాలు, వాహనాలను రాయితీపై అందించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఐదేళ్ల పాలనలో దాదాపు 40,000 మందికి రూ.800 కోట్ల లబ్ధిని బీసీలకు చేకూర్చిన ఘనత అప్పటి టీడీపీ ప్రభుత్వానిది. కానీ 2019లో వైసీపీ గద్దెనెక్కగానే ఈ పథకాలన్నింటికి గ్రహణం పట్టించడంతో పాటు బీసీ కార్పొరేషన్‌ను నిర్వీవం చేసేసింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాయితీ రుణాలకు నోచుకోని వెనకబడిన వర్గాల ప్రజలు అన్ని విధాలుగా నష్టపోయారు.

ప్రస్తుతం నిధుల కేటాయింపు...

కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే బీసీలకు ఏ విధంగా లబ్ధి చేకూర్చాలనే అనే అంశంపై దృష్టి పెట్టింది. దానికి అనుగుణంగానే జిల్లాల వారీగా నిధులు కేటాయింపుతో పాటు లబ్దిదారుల సంఖ్యను కూడా ప్రకటించింది. గుంటూరు జిల్లాకు సంబంధించి ఏడాది వ్యవధిలో రూ.69 కోట్లను వెనకబడిన వర్గాల రుణాల కోసం రాయితీల రూపంలో అందించాలని కేటాయింపులు జరపడంతో పాటు 4,490 మందికి ఈ నిధుల ద్వారా లబ్ది చేకూర్చాలని సంకల్పించింది. అదే విధంగా బాపట్ల జిల్లాకు గాను రూ.47.60 కోట్లు కేటాయించిన పాలకులు 2,875 మందికి లబ్ధి చేకూర్చేలా ప్రణాళికలు రచించారు. ఇక పల్నాడు జిల్లాకు వచ్చేసరికి 3,691 మంది లబ్దిదారులకు గాను రూ.58 కోట్లను ఖర్చు చేయనున్నారు. దీనికి సంబంధించిన ప్రక్రియ ఇప్పటికే మొదలు కాగా డిసెంబరు రెండో వారం నుంచి లబ్ధిదారుల ఎంపికను చేపట్టే దిశగా అడుగులు వేయనున్నారు

మహిళలు, చేతివృత్తులు...

రాయితీ రుణాలలో అగ్ర తాంబూలం మహిళలతో పాటు చేతివృత్తుల వారికే కేటాయించే విధంగా మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఆయా యూనిట్ల ఏర్పాటుకు రుణాలు అందించడంతో పాటు నైపుణ్యంపై కూడా ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇక మహిళల విషయానికి వచ్చేసరికి బ్యూటీషియన్ విభాగంతో పాటు మగ్గం, కంప్యూటర్ ఇతర నైపుణ్య కోర్సుల్లో శిక్షణ ఇచ్చి వారికి రాయితీ రుణాలు అందించి సొంతకాళ్ల మీద నిలబడేలా ప్రభుత్వం వారికి అండగా నిలవనుంది.

రైల్వేలో గుర్తింపు సంఘాల పోలింగ్ ప్రారంభం

- తొలి రోజున 2,520 మంది ఓటుహక్కు వినియోగం
- 12న డీఆర్ఎం ఆఫీసులో ఓట్ల లెక్కింపు

గుంటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో గుర్తింపు సంఘాల కోసం ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. బుధవారం ఉదయం నుంచి గుంటూరు రైల్వే డివిజన్ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లలో ఉద్యోగులు ఓటుహక్కు వినియోగించుకోవడం మొదలు పెట్టారు. 5, 6 తేదీల్లోకూడా పోలింగ్ జరగనుంది. మొత్తం 4,507 మంది ఓటర్లకు గాను తొలి రోజున 2,520 మంది ఓటుహక్కుని వినియోగించుకొన్నారు. గుంటూరు నగరంలోని రైల్ మహల్‌లో 703, డీఆర్ఎం ఆఫీసులో 598 మంది ఓటు వేశారు. ఈ సందర్భంగా సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్, దక్షిణ మధ్య రైల్వే మజ్దూరు యూనియన్‌లో ఓటు సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసి తమకు మద్దతు ఇవ్వాలని ఉద్యోగులను అభ్యర్థించాయి. సంఘ్ డివిజనల్ సెక్రెటరీ రమణయ్య, మజ్దూరు యూనియన్ డివిజనల్ కార్యదర్శి ఎంపీ ప్రసాద్‌లు తమ యూనియన్ల నాయకులు, సభ్యులతో కలిసి పోలింగ్ సరళిని పరిశీలించారు.



రైల్‌మహల్ వద్ద ఓటుహక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ఉద్యోగులు

8 మంది యువకుల అరెస్టు

2.27 కిలోల గంజాయి స్వాధీనం

కొల్లిపర, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గంజాయి తాగడంతో పాటు విక్రయిస్తున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి నుంచి 2.27 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెనాలి రూరల్ సీఐ బెల్లంకొండ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం కొల్లిపర పోలీసుస్టేషన్‌లో నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టిన సీఐ కేసు వివరాలు తెలిపారు. కొల్లిపర మండలం పిడపర్తిపాలెం లాకుల ఎదురుగా పుష్కర ఘాట్ వద్ద ఎనిమిది మంది యువకులు గంజాయితో ఉన్నట్లు సమాచారంతో ఎస్ఐ కోటేశ్వరరావు సిబ్బందితో కలిసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నున్న 2.27 కిలోల గంజాయిని, 3 వేల నగదును, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒడిశాకి చెందిన అప్పారావు, విజయవాడకు చెందిన గౌతమ్, దీపక్, కొల్లిపర మండలం తూములూరుకి చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



నిందితులను అదుపులోకి తీసుకున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ కోటేశ్వరరావు

కార్మికవర్గ సమస్యలపై సమీక్ష నిర్వహించాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్

గుంటూరు(తూర్పు), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని, పలు ప్రాజెక్టులపై నిరంతరం సమీక్షలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో దీర్ఘకాలికంగా నెలకొన్న కార్మికవర్గ సమస్యలపై కూడా సమీక్షించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ కోరారు. స్థానిక కొత్తపేట మల్లయ్య లింగం భవన్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికశాఖలో నెలకొన్న ఖాళీలను భర్తీ చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 50 లక్షల మంది కార్మికులు గత 15 సంవత్సరాలుగా పెరుగుదల లేని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేవారు. ఇసుక కొరత, సంక్షేమ పథకాలు అందక రాష్ట్రంలో లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుపై కూడా ప్రభుత్వం సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ గిట్టుబాటు ధరపై చట్టం చేయాలని రైతులు చేపట్టిన పాదయాత్రను కేంద్రం అడ్డుకోవడం సరైనది కాదన్నారు. కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను విడనాడలన్నారు. సమావేశంలో కోట మాల్యాద్రి, రావుల అంజిబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రావులపల్లి రవీంద్రనాథ్

కనుల పండువగా కల్లిపాడు

- ముగిసిన వీరారాధన ఉత్సవాలు
- పోతురాజుగుట్ట వద్ద తంగెడ మండలపై ఒరిగిన కొణతములు



కన్నమదాసు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

కారంపూడి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధన ఉత్సవాల్లో చివరిరోజైన బుధవారం కల్లిపాడులో భాగంగా లంకన్నకు ప్రాణప్రతిష్ఠ చేసే కార్యక్రమం నిర్వహించారు. యుద్ధ భూమిలో లంకన్న ఒరుగు బండపై యాదవ సామాజికవర్గానికి చెందిన వీరాచారవంతుడు శవంగా తెల్లబట్టలు కప్పుకొని పడుకొని ఉండగా పైన బాణాలు ఉంచారు. పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు వీరుల సేవా స్థానానికి ఊరేగింపుగా వచ్చి తొలుత కొణతములకు ఊరేగింపు జరిపారు. లంకన్న ఒరిగిన ప్రదేశానికి చేరుకొని ఆనాడు బ్రహ్మనాయుడు తులసీతీర్థమిచ్చి ప్రాణప్రతిష్ఠ చేసిన విధంగా నాటకీయంగా నిర్వహించారు. వీర విద్యావంతులు లంకన్న ఒరుగు కథను గానం చేస్తుండగా, కొందరు వీరాచారవంతులు కత్తిసేవ చేశారు. వీరాచారవంతుడు వేకువ జామున 4 గంటలకే శవంగా పడుకోగా, మధ్యాహ్నం 2 గంటల వరకు శవంలా కదలకుండా ఉండడం ఈ కార్యక్రమంలో విశేషం. ఆవుల మంద కాపరి అయిన లంకన్నను నాగమ్మ సైన్యం మట్టుబెట్టగా విష్ణు సంభూతుడైన బ్రహ్మనాయుడు లంకన్నకు తులసీతీర్థం ఇచ్చి ప్రాణప్రతిష్ఠ చేసే ఘట్టం నిర్వహించారు. అనంతరం లంకన్నగా ఉన్న వీరాచారవంతుడిని నాగులేటిలోని గంగధార మడుగు వద్దకు తీసుకెళ్లి స్నానమాచరింపజేశారు. ఆ తర్వాత కొణతములకు గ్రామోత్సవం జరిపారు. చెన్నకేశవస్వామి, అంకాళమ్మ ఆలయాల్లో తీర్థం స్వీకరించారు. వీర్ల దేవాలయం వద్ద కత్తిసేవ చేశారు. ఇలా కల్లిపాడు కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వీరాచార పీఠం నిర్వాహకుడు బొగ్గరం విజయ్‌కుమార్ అయ్యవారు పర్యవేక్షించారు.

కారంపూడిలో ఐదు రోజులుగా జరిగిన పల్నాటి వీరారాధన ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరిరోజు బుధవారం నాడు కల్లిపాడు నిర్వహించారు. వీరాచారవంతుడు శవంను తలపించేలా వేకువజామున నాలుగు గంటలకు పడుకుని మధ్యాహ్నం రెండు గంటల వరకు కదలకుండా అలాగే ఉండటం ఆకట్టుకుంది. గ్రామోత్సవంలో చివరిగా కొణతములకు ఊరేగింపు నిర్వహించారు.



శవంగా పడుకున్న వీరాచారవంతుడు



ప్రాణప్రతిష్ఠ అనంతరం వీరాచారవంతుడిని గంగధారమడుగుకు తీసుకెళ్తున్న పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు

ముగిసిన వీరారాధన ఉత్సవాలు

గత నాలుగు రోజులుగా 'రాచగావు', 'రాయభారం', 'మందపోరు', 'కోడిపోరు'లతో నిర్వహించిన వీరారాధన ఉత్సవాలు బుధవారం నిర్వహించిన 'కల్లిపాడు'తో ముగిశాయి. రాత్రి వేళ బ్రహ్మనాయుడు నృసింహకుంతంతో పాటు దైవాలు (కొణతములు) గ్రామోత్సవంలో చివరిగా ఊరేగింపు నిర్వహించగా, ఇంటింటి వద్ద హారతులు పట్టారు. కొణతములకు నూతన వస్త్రాలు, నైవేద్యాలు సమర్పించారు. పోతురాజు గుట్ట వద్ద తంగెడ మండలపై కొణతములన్నీ ఒరిగాయి. ఈ తంగెడ మండలను ప్రజలు తమ గృహాల గడపల వద్ద కట్టుకున్నారు. దీంతో ఉత్సవాలు ముగిశాయి.

వీరుల దేవాలయం అభివృద్ధికి కృషి

- పల్నాటి చరిత్రను దేశమంతటా విస్తరింపజేస్తాం
- రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి రవికుమార్

స్థానిక వీరుల దేవాలయం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. వీరారాధన ఉత్సవాల్లో చివరిరోజున నిర్వహించిన కల్లిపాడులో మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వీరారాధన ఉత్సవాల్లో తాను పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. వీరులను స్మరించుకుంటూ చేసే ఉత్సవాలను భారతదేశంలో కారంపూడిలో మాత్రమే నిర్వహిస్తారన్నారు. సమసమాజ స్థాపనకు బ్రహ్మనాయుడు కుల, మతాలకు అతీతంగా ఆ రోజుల్లోనే సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారన్నారు. అనంతరం వీరుల దేవాలయం, చెన్నకేశవస్వామి, అంకాళమ్మ అమ్మవారి ఆలయంలో మంత్రి, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ఎం అశోక్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మాలమహానాడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కన్నమదాసు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారుతో కలిసి కొణతముల గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ఎడ్ల బండలాగుడు పోటీలు, జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను ప్రారంభించారు.



సీనియర్స్ విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిన నంద్యాల ఎడ్లజతతో మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

ముగిసిన ఎడ్లబండలాగుడు పోటీలు

సీనియర్స్ విభాగంలో నంద్యాల ఎడ్ల జతకు ప్రథమ స్థానం

వీరారాధన ఉత్సవాల సందర్భంగా స్థానికంగా నిర్వహించిన ఎడ్ల బండలాగుడు పోటీలు ముగిశాయి. బుధవారం సీనియర్ విభాగంలో పోటీలు జరిపారు. నంద్యాల జిల్లా గుంపరమానుదిన్నెకు చెందిన కుందూరు రాంభోపాల్‌రెడ్డి ఎడ్ల జత నిర్ణీత వ్యవధిలో పందెపు బండను 2665.01 అడుగుల దూరం లాగి ప్రథమస్థానంలో నిలిచింది. బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన పావులూరి వీరాస్వామి చౌదరి ఎడ్లజత 2651.02 అడుగులతో రెండోస్థానం, బాపట్ల జిల్లా వేటపాలెంకు చెందిన అత్తోట శిరీషాచౌదరి, శివకృష్ణచౌదరి ఎడ్ల జత 2,200 అడుగులతో మూడోస్థానం, గుంటూరు జిల్లా లింగాయపాలెంకు చెందిన యలం సాంబశివరావు ఎడ్లజత 1,603 అడుగులతో నాలుగోస్థానం, నంద్యాల జిల్లా గుంపరమానుదిన్నెకు చెందిన కుందూరు రాంభోపాల్‌రెడ్డి ఎడ్లజత 1600 అడుగులతో ఐదో స్థానంలో నిలిచాయి. ఈ పోటీలకు వ్యాఖ్యాతలుగా సూరపనేని రాధాకృష్ణ, గూడా శ్రీనివాసరావులు వ్యవహరించారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

రేపు ముక్కోటి ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష

మంగళగిరి సిటీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహ స్వామి క్షేత్రంలో జనవరి పదో తేదీన జరుగనున్న ముక్కోటి ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై దేవస్థానం ఆవరణలో ఈ నెల 6వ తేదీన ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్టు తహసీల్దారు కే దినేష్ రాఘవేంద్ర తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది సమావేశానికి హాజరుకావాలని కోరారు.

దాతల సేవలు అభినందనీయం

● ఎంఈవో కెన్నడీ

కాకుమాను, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు చేస్తున్న సేవలు అభినందనీయమని మండల విద్యాశాఖాధికారి కేఎఫ్ కెన్నడీ అన్నారు. మండలపరిధిలోని కొండపాటూరు ఎంపీయూపీ పాఠశాలలో పూర్వ విద్యార్థులు జాస్తి రామయ్య ఈశ్వరమ్మల కుమార్తెలు పాఠశాలలో ఆధునిక తరగతి గదుల ఏర్పాటు(స్మార్ట్ రూం) కోసం రూ.2.50 లక్షలు, అలాగే పాఠశాలపై కప్పు ఏర్పాటుకు యార్లగడ్డ అంకమ్మ చౌదరి రూ.లక్షా 30 వేలు వ్యయంతో చేసిన డిజిటల్ క్లాస్ రూమ్‌ను దాతలతో కలసి ఎంఈవో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు దాతల సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 విజయభాస్కర్, హెచ్ఎం అంకారావు, సత్యం, టీడీ ప్రసాద్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొని దాత లీలాకుమారిని సన్మానించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ పీడీ తనిఖీ

పెదనందిపాడు, డిసెంబరు, 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అబ్బినేనిగుంటపాలెంలో అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.ఉమాదేవి ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను, చిన్నారుల హాజరు శాతాన్ని పరిశీలించారు. చిన్నారులకు, తల్లులకు, గర్భిణులకు పౌష్టికాహారం సక్రమంగా అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో జరుగుతున్న టాయిలెట్స్, వాటర్ హార్వెస్ట్ నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట సీడీపీవో సుజాతాదేవి, ఏసీడీపీవో సీహెచ్ విజయ నిర్మల, సూపర్‌వైజర్ అరుణ ఉన్నారు.

ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో పోటీలు

మంగళగిరి సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీపీఐ శత వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఏకపాత్రాభినయం, పాటల పోటీలు నిర్వహిస్తున్న జిల్లా ఉపాధ్యక్షుడు కంచర్ల కాశయ్య తెలిపారు. మంగళగిరి సీపీఐ కార్యాలయంలో బుధవారం ఆయన వివరాలను వెల్లడించారు. ఈ నెల 26వ తేదీ నాటికి సీపీఐ వంద వసంతాలు పూర్తి చేసుకుంటుందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా కళాకారులను ప్రోత్సహించేలా ఈనెల 8వ తేదీన ఉదయం గుంటూరు కొత్తపేటలోని సీపీఐ కార్యాలయంలో ఏకపాత్రాభినయం, పాటల పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విజేతలకు నగదు పారితోషికం తోపాటు ప్రశంసాపత్రం అందజేసి, డిసెంబరు 16, 17 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు పాల్గొనాలని ఆయన కోరారు.

నిజాయితీ చాటుకున్న సైకిల్ మెకానిక్

తాడేపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి గ్రామానికి చెందిన సైకిల్ మెకానిక్‌గా పని చేస్తూ జీవనం సాగించే రమణకి ఒడిస్సా రాష్ట్రం మల్కానగరి గ్రామానికి చెందిన దంకాజ్ మజ్హాహి అనే వ్యక్తికి చెందిన అకౌంట్ నుంచి పొరపాటున రూ.లక్ష రావడం జరిగింది. రమణ అవి తన డబ్బులు కావని గ్రహించి తిరిగి బాధితుడి అకౌంట్‌కు రూ.లక్ష పంపించారు. రమణ డబ్బులు వెనక్కి పంపించడంతో కృతజ్ఞతతో తిరిగి మూడు వేలు రమణకు బాధితుడు పంపించారు. తనవి కాని డబ్బులను సకాలంలో బాధితుడికి పంపించి తన నిజాయితీ నిరూపించుకున్న రమణను గ్రామస్థులు అభినందించారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం

తాడేపల్లి టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని బుధవారం గుంటూరు రైల్వే పోలీసులు కనుగొన్నారు. మృతుని ఒంటిపై ఎరుపు రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు, జర్కిన్ ఉందని, వయస్సు 40 సంవత్సరాలు ఉంటాయని పేర్కొన్నారు. ఎవరైనా మృతుడి ఆచూకి తెలిస్తే గుంటూరు రైల్వే పోలీసుస్టేషన్‌లో 9440627546, 9908383300 నెంబర్లలో సంప్రదించాలని సీఐ అంజిబాబు తెలిపారు.

రైలు కింద పడి యువకుడి మృతి

మంగళగిరి సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్‌పై ఓ యువకుడి మృతదేహాన్ని రైల్వే పోలీసులు కనుగొన్నారు. రైల్వే సీఐ అంజిబాబు తెలిపిన వివరాల ప్రకారం మృతుని వయస్సు సుమారు 25 సంవత్సరాలు ఉంటుందని, ప్రమాదంలో మృతుని తల ఛిద్రమైందని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు, మృతుని ఆచూకీ తెలిసిన వారు సెల్: 9440627546, 9908383300 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

తండ్రి మృతిపై కుమారుడి ఫిర్యాదు

తుళ్లూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో తండ్రి మృతి చెందటంపై కుమారుడు తుళ్లూరు పోలీసుస్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. మండలపరిధిలోని రాయపూడి గ్రామానికి చెందిన చిలకా చంద్రశేఖర్ (58)కి ముగ్గురు చెల్లెలు, 4వ భార్య కలసి ఆస్తుల వివాదంతో ఇటీవల కోర్టు నోటీసులు పంపించారు. అప్పటి నుంచి చంద్రశేఖర్ మనస్తాపంతో ఉన్నాడని, మంగళవారం రాత్రి భోజనం అనంతరం కోర్టు ఆలోచనలతోనే నిద్రకు ఉపక్రమించి తెల్లారేసరికి మృతి చెంది ఉన్నాడని, దీనికి వారే కారణమని ఫిర్యాదులో కుమారుడు చిలకా కోటేశ్వరరావు పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అంకమ్మ తెలిపారు. కాగా మృతుడికి 0.90 సెంట్లు లంక భూమి ఉంది.

దోమలు బాబోయ్ దోమలు

● పగలు, రాత్రి తేడా లేకుండా స్వైరవిహారం
● దోమల దెబ్బకి ఠారెత్తుతున్న గ్రామస్థులు
● నివారణకు చర్యలు శూన్యం



చిన్నమసీదు ప్రాంతంలో ఇళ్ల మధ్య పేరుకుపోయిన మురుగు



ఎస్టీ కాలనీలో మురుగు కాల్వల్లో పేరుకుపోయిన వ్యర్థాలు

తాడికొండ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తాడికొండ గ్రామంలో దోమలతో గ్రామస్థులు అల్లాడుతున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దోమల దెబ్బకి ప్రజలు ఠారెత్తుతున్నారు. రాత్రి సమయంలో పట్టుమని పది నిమిషాలు కూడా నిలబడలేని పరిస్థితి. దోమ కాటుకు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారు. పగటి పూట కూడా దోమలు వీర విహారం చేస్తున్నాయి. కాల్వల్లో, చెత్తకుప్పల్లో దోమలు విజృంభిస్తున్నాయి. పల్లెల్లో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పారిశుధ్యంపై సరైన చర్యలు తీసుకోకపోవటంతో ప్రజలు రోగాల బారినపడుతున్నారు. పలు గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే పడేస్తున్నారు. స్వచ్ఛ భారత్ పేరుకే గానీ పాటించిన దాఖలాలు కన్పించటం లేదు. కొన్ని పంచాయతీలు కనీసం చెత్తను వేయటానికి చెత్త కుండీలను కూడా ఏర్పాటు చేయలేని పరిస్థితి ఉన్నది. దీని వల్ల ప్రజలు చెత్తను రోడ్డు పక్కనే పడేస్తున్నారు. దీంతో దుర్వాసన వస్తోంది. మురుగు నీరు పారటానికి కాలువలు సరిగ్గాలేవు. ఉన్నా వాటిలోని మురుగును తొలగించటం లేదు. పారిశుధ్యం సక్రమంగా లేకపోవటం వల్ల దోమలు వృద్ధి చెందుతున్నా యి. దీంతో వైరల్ ఫీవర్, డెంగీ, చికెన్ గున్యా వ్యాధులు ప్రబలుతున్నాయి. కొన్ని పంచాయతీలు కనీసం ఫాగింగ్ కూడా చేయటం లేదు. గ్రామాల్లో పందులు విపరీతంగా తిరుగుతున్నాయి. దీని వల్ల అంటువ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. తాడికొండ మెయిన్ రోడ్డు ఇరువైపుల కాలువలో పనికిరాని కాగితాలు, చెత్త పేరుకుపోయి మురుగునీరు నిల్వ ఉండి దోమలు విపరీతంగా పెరుగుతున్నాయి. పంచాయతీ వారు గ్రామంలో ఫాగింగ్ చేసి, కాలువలను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్ల నిర్మాణాలకు ఆటంకాలు లేకుండా సీఆర్డీఏ చర్యలు

● రాయపూడి ఎన్-12 రోడ్డు బాధితులతో డీసీ సమావేశం



రాయపూడి యూనిట్ కార్యాలయంలో రోడ్డు బాధితులతో మాట్లాడుతున్న సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్ హుస్సేన్

తుళ్లూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాజధాని గ్రామం రాయపూడిలో తూర్పు ముఖంగా రాజధాని రోడ్ల నిర్మాణాల్లో భాగంగా ఎన్-12 రోడ్డు వేయాల్సి ఉంది. అందులో నివాసాలు, స్థలాలు పోతున్నాయి. వాటి నష్టపరిహార విషయమై చర్చించేందుకు రాయపూడి సీఆర్డీఏ యూనిట్ కార్యాలయంలో రోడ్డు బాధితులతో డిప్యూటీ కలెక్టర్ హుస్సేన్ బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. రోడ్డే కాదు.. గ్రామ కంఠాల దగ్గర నుంచి పలు సమస్యలున్నాయని, అధికారులతో పాటు స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ఉండాలని సమావేశంలో గ్రామస్థులు స్పష్టంగా చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వంలో రోడ్డు కింద స్థలాలు, ఇళ్లు , పశువుల పాకలు, ఇతర చిన్న చిన్న వ్యాపారాలున్న వారిని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ ఒప్పించారన్నారు. అందుకు ప్యాకేజీ అమలు చేశారని, అప్పుడున్న ఎమ్మెల్యేనే ఇప్పుడూ ఉన్నారని కనుక స్థానిక ఎమ్మెల్యేతో మీటింగ్ నిర్వహించాలని బాధితులు అభిప్రాయం వ్యక్తం చేశారు. గతంలో ఈ-3 కింద బి ఫారం ఉన్న స్థలాలు తీసుకొని పక్కనే ఇచ్చారన్నా రు. వాటికి రిజిస్ట్రేషన్ చేస్తామని సీఆర్డీఏ అధికారులు చేయలేదని తెలిపారు. బాధితులకు న్యాయం చేయటం కోసమే సమావేశం పెట్టామని డీసీ హుస్సేన్ తెలిపారు. రోడ్డు కింద పోయే ఇళ్లకు రెట్టింపు పరిహారం అమలు చేయమని, స్థలానికి స్థలం ఇవ్వాలని ప్రభుత్వం జీవో నెంబరు 153 జారీ చేసిందని ఆయన వివరించారు. ఆ స్థలాలు ఎక్కడ ఇస్తున్నారో చెప్పాలని రోడ్డు బాధితులు కోరారు. నిమ్మ అరటి తదితర తోటల్లో ఇళ్లు వేసుకొని అక్కడే నివాసాలుంటున్నామని, ల్యాండ్ పూలింగ్‌కి తీసుకున్నప్పుడు ఇంటికి పరిహారం ప్రకటించి స్థలం కేటాయించారని, ఆ స్థలం ఎక్కడుందో చూపాలని కోరారు. వెంటనే చూపుతామని డీసీ హామీనిచ్చారు. బాధితులకు పూర్తి న్యాయం జరిగే విధంగా సీఆర్డీఏ పని చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో త్వరలోనే మరొకసారి సమావేశం ఏర్పాటు చేస్తామని డీసీ చెప్పారు. అనంతరం ఈ- 3 రోడ్డు కింద ఇచ్చిన ప్రగతినగర్ స్థలాలను ఆయన పరిశీలించారు. వాటి రిజిస్ట్రేషన్ జరిగేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సమావేశం గ్రామ టీడీపీ అధ్యక్షుడు మూల్పూరి అధ్యక్షతన నిర్వహించారు.

గ్రామీణ రోడ్లను త్వరగా పూర్తి చేయాలి

● డ్వామా పీడీ వీ శంకర్



వేములూరిపాడులో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న డ్వామా పీడీ పీ శంకర్ తదితరులు

ఫిరంగిపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో నిర్మాణాలు జరుగుతున్న సిమెంట్ రోడ్లను త్వరగా పూర్తి చేయాలని గుంటూరు జిల్లా డ్వామా పీడీ వీ శంకర్ అన్నారు. మండలంలోని వేములూరిపాడు గ్రామంలో గల ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి ఎస్సీ కాలనీ వరకు, బీసీ కాలనీలో రూ.35 లక్షలతో నిర్మిస్తున్న అంతర్గత రోడ్ల నిర్మాణాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఈ రహదారుల నిర్మాణం జరుగుతుందన్నారు. గతంలో వేసిన రోడ్లకు బిల్లులు తయారు చేసి త్వరగా పంపితే నిధులు విడుదల చేస్తామన్నారు. అంతేగాక గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఇంకుడుగుంత నిర్మాణాన్ని ఆయన ప్రారంభించారు. వర్షపు నీటిని ఒడిసి పడితే నీటి కొరత ఉండదన్నారు. అలాగే గ్రామంలోని చెరువులో కంప చెట్లను తొలగింపు చేసి చెరువును అభివృద్ధి చేయాలన్నారు. అదే విధంగా గేదెల షెడ్డును పూర్తి చేయాలని గేదెల యజమానికి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, పీఆర్ఏఈ ఎం శ్రీనివాస్, ఏపీవో జయకుమార్, సర్పంచ్ కొరివి ఆనంద్, తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కటికల రాము, గ్రామ అధ్యక్షుడు పచ్చల రత్నరాజు, కార్యదర్శి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

● డీఎంహెచ్‌వో విజయలక్ష్మి



పీహెచ్‌సీకి వచ్చిన బాలింతలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

దుగ్గిరాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వైద్యఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. దుగ్గిరాలలోని పీహెచ్‌సీలో ఆమె బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సిబ్బంది హాజరుపట్టీని పరిశీలించడంతో పాటు, పీహెచ్‌సీకి రోజువారీ వచ్చే రోగుల రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. వైద్యశాలలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల సెషన్‌ను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైద్య పరీక్షల విభాగంలో అవసరమైన సామగ్రి, మందుల అవసరమైన మేరకు అందుబాటులో ఉంటున్నాయా తదితర అంశాలను ఆరా తీశారు. పీహెచ్‌సీలో జరుగుతున్న కార్యక్రమాలను ఎప్పటికప్పుడు అంతర్జాలంలో నమోదు చేయాలన్నారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ అబ్దుల్ రెహ్మాన్, డాక్టర్ ఇందిర, హెల్త్ ఎడ్యుకేటర్ వంకదార సుబ్బారావు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాశాఖ అధికారుల అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలి

● యూటీఎఫ్ మండల శాఖ సభ్యులు



ఎంఈవో రమాదేవికి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ సభ్యులు

ప్రత్తిపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ అసంబద్ధ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని యూటీఎఫ్ ప్రత్తిపాడు మండల శాఖ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రత్తిపాడు ఎంఈవో రమాదేవికి వినతిపత్రం అందజేశారు. పాఠశాలల పనివేళలు పెంపుతో పాటు పది శాతానికి మించి ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదనే ఆంక్షలు, సంసిద్ధత పేరుతో పదో తరగతి విద్యార్థుల కోసం వంద రోజుల యాక్షన్ ప్లాన్, అపార్‌లో పేర్లు నమోదు వంటి విషయాలను యూనియన్ తప్పుబట్టింది. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే ఈ నెల 11వ తేదీన అన్ని జిల్లా విద్యాశాఖ కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శనలు, 16వ తేదీన రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రతినిధులు జీ.రవికుమార్, షకీలా బేగం, చంద్రశేఖర్ రెడ్డి, కే. వెంకట నారాయణ, ఎన్.అంకమ్మరావు, సదాశివరావు, ప్రేమకుమార్, కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏసీసీ కార్మికుల రిలే దీక్షలు ప్రారంభం

తాడేపల్లి టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిన్నటి వరకు నిరసన కార్యక్రమాలు చేసిన ఏసీసీ కార్మికులు తమకు రావలసిన నష్టపరిహారం సాధన కోసం పోరాట శిబిరంలో నేటి నుంచి మరోదశ పోరాటానికి శ్రీకారం చుడుతూ రిలే దీక్షలను చేపట్టారు. ఈ దీక్షలను సీఐటీయూ నాయకులు బీ వెంకటేశ్వర్లు, డీ వెంకటరెడ్డి, వైఎస్సార్‌టీయూ నుంచి డీ వేమారెడ్డి, బీ వేణు, డేవిడ్‌రాజు, ఏఐఎఫ్‌టీయూ (న్యూ) నుంచి ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, కోటయ్య, ఏఐటీయూసీ నుంచి కంచర్ల కాశయ్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి వేముల దుర్గారావు అధ్యక్షతన జరిగిన సభలో సీఐటీయూ నాయకులు డి.వెంకటరెడ్డి, రైతు సంఘం నాయకులు జొన్నా శివశంకరరావు, ఏఐఎఫ్‌టీయూ నాయకులు నాగేశ్వరరావు, కోటయ్య, ఏఐటీయూసీ నాయకులు కంచర్ల కాశయ్యలు, వైసీపీ నాయకులు డీ వేమారెడ్డి పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. వైసీపీ సమన్వయకర్త వేమారెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే లోకేశ్ దీనిపై వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షల్లో కూరపాటి స్టీవెన్, కె.ఆదినారాయణ, బాషా, యెహోషువ కూర్చున్నారు. కార్యక్రమంలో సాంబయ్య, బీ అంకయ్య, ఎం ఆశీర్వాదం, బీ సూర్యప్రకాష్, శారద, సుబ్బారావు, నాగేశ్వరరావు, ఇమాంబి, అమానుల్లా, కాన్, శౌరమ్మ, శివమ్మ, గురవయ్య, దానయ్య సాంబశివరావు పాల్గొన్నారు.

6న జరిగే పాదయాత్రను జయప్రదం చేయాలి

ఏసీసీ కార్మికులు నిర్మించుకున్న 200 గుడిసెలను అక్రమంగా కూల్చివేతకు కారణమైన కార్పొరేషన్ అధికారుల చర్యలను ఖండిస్తూ వారికి మద్దతుగా వస్తున్న అన్ని కార్మిక సంఘాల వారితో దీక్షా శిబిరం నుంచి 6వ తేదీన చేసే పాదయాత్రను జయప్రదం చేయాలని నష్ట పరిహార పోరాట సాధన కమిటి కన్వీనర్ కూరపాటి స్టీవెన్ కోరారు. 6వ తేదీన ఉదయం 10గంటలకు మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం వరకు సాగే నిరసన పాదయాత్రను, అనంతరం కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

కొనసాగుతున్న సప్తాహ మహోత్సవ పూజలు

వట్టిచెరుకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వింజనంపాడు గ్రామపరిధిలోని కోదండ రామస్వామి ఆలయంలో 60వ సప్తాహ మహోత్సవంలో భాగంగా దేవాలయంలో బుధవారం హరేరామ కీర్తనలతో ఆలయ ప్రాంగణం మార్మోగుతోంది. మూడు గంటలకు భక్త బృందం వివిధ రకాల వాయిద్యాలతో హరే రామ కీర్తలను ఆలపిస్తున్నారు. దేవాలయంలోని స్వామి విగ్రహాలను పూలమాలలతో అలంకరించారు.

రేషన్ బియ్యం స్వాధీనం



అక్రమంగా రేషన్ బియ్యం కలిగి ఉన్న వ్యక్తులను పట్టుకొని, బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న సీఐ

ఫిరంగిపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఫిరంగిపురంలోని ఎస్టీ కాలనీలో గల మేడా నాగేశ్వరరావు, ఉయ్యాల కోటేశ్వరరావుల వద్ద మంగళవారం అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ రవీంద్రబాబు బుధవారం తెలిపారు. మేడా నాగేశ్వరరావు వద్ద 2,120 కేజీలు, ఉయ్యాల కోటేశ్వరరావు వద్ద 140 కేజీల రేషన్ బియ్యాన్ని స్వాధీన పరుచుకున్నామని చెప్పారు. ఇద్దరిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.

కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే బూర్ల పరామర్శ

ప్రత్తిపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాతమల్లాయపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ బీసీ నాయకుడు కొమ్మూరి మల్లికార్జునరావు ఇటీవల హఠాన్మరణం పొందారు. ఆ కుటుంబాన్ని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు బుధవారం పరామర్శించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలు మరణించడం బాధాకరమన్నారు. పార్టీ ఎప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు ధైర్యాన్నిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్, డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ కుర్రి సుబ్బారెడ్డి, కాసు పెంటారెడ్డి, కుర్రి అంజిరెడ్డి, భాస్కర్ రెడ్డి, కుర్రి కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బైబిల్ క్విజ్ పోటీలు

ఫిరంగిపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నుదురుపాడులో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 14వ తేదీన ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి బైబిల్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు పీస్ మినిస్ట్రీస్ క్విజ్ కన్వీనర్ పాస్టర్ పీ దాసు బుధవారం తెలిపారు. క్విజ్ పోటీల్లో ఆసక్తి గల యువతీ, యువకులు, పెద్దలు పాల్గొనాలని కోరారు. పాస్టర్ ట్రైనింగ్ చేసిన వారు పాల్గొనకూడదని ఆయన తెలిపారు. ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు క్విజ్ పోటీలు జరగనున్నాయని, విజేతలకు రూ.8 వేల నుంచి వరుసగా రూ.500 వరకు బహుమతులు ఉంటాయన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 10వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు క్విజ్ కన్వీనర్, పాస్టర్ పీ దాసు, సెల్ : 9000037320ను సంప్రదించాలని ఆయన కోరారు.

పాఠశాలకు బెంచీలు అందజేత



జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు బెంచీలు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

పెదనందిపాడు, డిసెంబరు, 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అన్నపర్రు కేఎస్ఆర్ జిల్లా పరిషత్ పాఠశాలకు రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట, పూర్వపు విద్యార్థి పరాంకుశ శ్రీనివాసరావు సహకారంతో రోటరీ హ్యాపీ స్కూల్స్ ప్రాజెక్ట్ కార్యక్రమంలో భాగంగా బుధవారం 40 బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా పరాంకుశ శ్రీనివాసరావు మాట్లాడుతూ పేద విద్యార్థుల అభ్యున్నతికి రోటరీ విశేష కృషి చేస్తుందని తెలిపారు. దాత శ్రీనికవాసరావును, రోటరీ సభ్యులను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఏపీసీబీఈఏ నేతలు

మంగళగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఏపీ కోఆపరేటివ్ బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ (టీఎన్‌టీయూసీ) నేతలు బుధవారం ఉండవల్లిలోని నివాసంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. అసోసి యేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.బాలాజీ ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అసోసియేషన్‌లో ఉన్న ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేసిన వైనాన్ని మంత్రి లోకేశ్‌కు వివరించామ న్నారు. గత నెలలో ఏలూరులో జరిగిన అసోసియేషన్ రాష్ట్ర జనరల్‌బాడీ సమావేశంలో కృష్ణా, కడప అసోసియేషన్లను స్టేట్ అసోసియేషన్ నుంచి గుర్తిం పును రద్దు చేసినట్టు తెలిపారు. ఈ విషయాలపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ సహకార బ్యాంకుల అసోసియేషన్‌లో మెజార్టీ సభ్యులు కలిగిన టీఎన్‌టీయూసీకి చెందిన ఎంప్లాయిస్ అసోసియేషన్‌ను మాత్రమే గుర్తించాలని చెప్పారన్నారు. వెంటనే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లాలని తన సిబ్బందిని మంత్రి లోకేశ్ ఆదేశించారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీసీబీఈఏ రాష్ట్ర చీఫ్ వైస్ ప్రెసిడెంట్ సుంకర శ్రీనివాసన్, ఉప ప్రధాన కార్యదర్శి జీ.శ్రీనివాస్, కోశాధికారి డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి అంగన్‌వాడీల విరాళం



మంత్రి లోకేశ్‌కు చెక్కును అందజేస్తున్న మంగళగిరి అంగన్‌వాడీలు

మంగళగిరి సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం మంగళగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళం అందించారు. సేకరించిన రూ.1,01,116లను చెక్కు రూపంలో బుధవారం మానవ వనరుల అభివృద్ధి, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు అందజేశారు. అలాగే తమ సమస్యలను మంత్రి లోకేశ్‌కు వివరించారు. ప్రభుత్వం తమకిచ్చే వేతనాలు సరిపోవడంలేదని, పనికి తగ్గట్టుగా జీతాలు పెంచాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు బండారు కల్యాణి, చెరుకు వినీల, హేమలత, సుహాసిని తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో డీఈవో ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో రేణుక

మంగళగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక బుధవారం మంగళగిరి పట్టణంలోని కేకే ఎంపీఎల్ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 9వ తరగతి విద్యార్థులకు జరుగుతున్న ఎస్ఏఎస్ ప్రోగ్రాం గురించి ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి బోధనాపరమైన అంశాలు, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. హాజరు పట్టికలు, పలు రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు కే శ్రీనివాసరావు, ఎస్ బాబు, ప్రధానోపాధ్యాయుడు ఎస్కే దరియావలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాలయాల నిర్వహణ సామాజిక బాధ్యతగా చూడాలి

● మండల స్పెషల్ అధికారి విజయలక్ష్మి

వట్టిచెరుకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బోధనకే ఉపాధ్యాయులు పరిమితం కాకుండా విద్యాలయాల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత కూడా తమ బాధ్యత అనేది గుర్తించి విధులు నిర్వహించటం హర్షణీయమని మండల స్పెషల్ అధికారి, డీఆర్‌డీఏ పీడీ పీవీ విజయలక్ష్మి ప్రశంసించారు. మండలపరిధిలోని లేమల్లెపాడు గ్రామంలో మండలపరిషత్ పాఠశాలను బుధవారం డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, ఎంపీడీవో రమేష్‌బాబు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలసి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. తొలుత విద్యార్థుల హాజరు పట్టికను, పాఠశాల గదులు, వంట గది, మధ్యాహ్న భోజనం తయారు కేంద్రం, అంగన్‌వాడీ, మరుగుదొడ్లను ఆమె పరిశీలించారు. అలాగే ఉపాధ్యాయుల విద్యాబోధన తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. దాతల సహకారంతో గ్రంథాలయ నిర్వహణ, పాఠశాల అభివృద్ధి, పరిసరాల శుభ్రతకు దాతల ప్రోత్సాహం, సహకారంతోనే తీర్చిదిద్దగలుగుతున్నామని హెచ్ఎం పసుపులేటి శ్రీధర్ స్పెషల్ ఆఫీసర్‌కు వివరించారు.

గ్రామసభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలి



వీఆర్వోల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటస్వామి

కాకుమాను, డిసెంబరు 4: గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభల ద్వారా రేషన్ కార్డులు, భూ సమస్యల పరిష్కారం అంశాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ వెంకటస్వామి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ వెంకట స్వామి మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రతి అధికారి పని చేయాలన్నారు. భూ మ్యూటేషన్, సెక్షన్ 22ఏ, ఎల్ఈసీ కార్డులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రియదర్శిని, వీఆర్వోలు శ్రీనివాసరావు, సుందరరావు, డానియేల్, సింగారావు, బోడెమ్మ పాల్గొన్నారు.

అపర కర్మశాల అభివృద్ధికి శంకుస్థాపన

తెనాలి అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐతానగర్ అపర కర్మశాల అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. దాతల సహకారంతో కర్మశాల అంతస్తు పనులను చేపట్టారు. కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జెట్టి అంకినీడు, ఈదర నాగేశ్వరరావు, నన్నపనేని సతీష్, మన్నె హరీష్, మురళీకృష్ణ, ఆంజనేయులు, ఈదర పూర్ణచంద్, ఈదర శ్రీనివాసరావు, పిచ్చయ్య చౌదరి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



భర్త వేధింపులపై ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి ఇరు కుటుంబాలను ఒప్పించి పెళ్లి చేసుకున్న 8 నెలలకే వేధింపులకు గురిచేస్తున్నాడని భార్య ఫిర్యాదుపై కేసు నమోదైంది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక బాలాజీరావుపేటకు చెందిన గ్లోరీకి చెరుకుపల్లి మండలం, తురిమెళ్ల గ్రామానికి చెందిన వినోద్‌లు ఒకే కళాశాలలో కలసి చదువుకున్నారు. ఆ సమయంలో ప్రేమించుకుని, కుటుంబ సభ్యుల అంగీకారంతో వివాహం చేసుకున్నారు. అనంతరం చెన్నైలో కాపురం పెట్టారు. భర్త వినోద్ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా ఆమె గృహిణిగా ఉంది. గతకొంత కాలంగా వీరి మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. భర్త ప్రతిరోజు మానసికంగా, శారీరకంగా చిత్రహింసలకు గురి చేస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు.

8న నెట్‌బాల్ సబ్ జూనియర్ బాలబాలికల జట్ల ఎంపిక

తెనాలి అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా నెట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో బాల బాలికల సబ్ జూనియర్ జట్ల ఎంపిక బుధవారం చెంచుపేట ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ నెల 8న ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అర్హులైన బాల బాలికలు హాజరు కావాలని, తగిన ధృవపత్రాలను సమర్పించాలని నిర్వాహకులు నాగరాజు, సుధాకర్ తెలిపారు. డిసెంబరు 31, 2008 తరువాత పుట్టిన క్రీడాకారులు అర్హులు. ఎంపికైన జట్లు ఈ నెల 14, 15 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని, వివరాలకు 9963334731లో సంప్రదించాలన్నారు.

10న దివ్యాంగుల దినోత్సవం

పొన్నూరు టౌన్, డిసెంబరు 4: డిసెంబరు 10వ తేదీన పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహిస్తునట్లు పొన్నూరు నియోజకవర్గ వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మురుగుల సాంబశివరావు తెలిపారు. పొన్నూరు పట్టణంలో బుధవారం వికలాంగుల సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సభకు నియోజకవర్గంలోని వికలాంగులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి మాడవత్ రాంబాబు నాయక్, డి.రామారావు, కందుల బుల్లి వెంకటేశ్వర్లు, షేక్ సుభానీ, సీహెచ్ శ్రీనివాసరావు, కత్తి గోపి పాల్‌రాజు, కాట్రగడ్డ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా టిక్కెట్ల ధరలు నియంత్రించాలి

తెనాలి అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సినిమా టిక్కెట్ల ధరలను నియంత్రించాల్సిన అవసరం ఉందని పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం అధ్యక్షుడు దరిశి శివకోటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, 12 రోజుల వరకు టిక్కెట్లు ధర పెంచుకుని అమ్మేందుకు అనుమతి ఇవ్వడం తగదన్నారు. ప్రభుత్వం అనుమతులు రద్దు చేయాలని సంఘ సభ్యులు కమలకుమార్, శివశంకరరావు, సోమయ్యశాస్త్రి, ఆరీఫ్, చిరంజీవి కోరారు.

ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన

తెనాలి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతుసేవా కేంద్రం సిబ్బంది నాగరాజు అవగాహన కల్పించారు. గ్రామంలోని రైతులవద్దకు నేరుగా వెళ్లి రైతు సేవా కేంద్రాలద్వారా కల్పిస్తున్న గిట్టుబాటుధరలు, తేమశాతం, అమ్ముకునే విధానం, డబ్బులు చెల్లింపులు వంటివాటిపై రైతులకు వివరించి దళారులను నమ్మి వేసపోవద్దని వారికి సూచించారు. పలువురు రైతులు పాల్గొన్నారు.

రేపు అంబేద్కర్ కాంస్య విగ్రహావిష్కరణ

తెనాలి అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహావిష్కరణ శుక్రవారం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. విగ్రహావిష్కరణ కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. చినరావూరుతోట మదర్‌థెరిస్సా నగర్‌లో శుక్రవారం సాయంత్రం విగ్రహాన్ని దళిత ఉద్యమ నిర్మాత కత్తి పద్మారావు ఆవిష్కరిస్తారని తెలిపారు.

కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలి: ఎంపీడీవో

తెనాలి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలు చేపట్టే కాంట్రాక్టర్లు నాణ్యతాప్రమాణాలు పాటించాలని మండల ఎంపీడీవో అత్తోట దీప్తి అన్నారు. బుధవారం మండలంలోని సంగంజాగర్లమూడి జగనన్న కాలనీలో కాంట్రాక్టర్ల ద్వారా చేపట్టిన ఇంటి నిర్మాణ పనుల నాణ్యతలను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాలనీల్లో గడ్డి పెరిగిపోయి చిట్టడివిని తలపిస్తూ ఉండటంతో పంచాయతీ అధికారులను జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని ఆదేశించారు.



ఇంటి నిర్మాణపనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో దీప్తి

పంట కాలువలోకి మురుగు నీరు

- చినరావూరు 14వ వార్డులో అధికారుల నిర్వాకం
- పర్యావరణానికి, ప్రజారోగ్యానికి ముప్పు
- రోజుల తరబడి వ్యర్థాలతో నీరు నిలిచి దోమల బెడద
- పంట కాలువను శుభ్రంచేయాలని స్థానికుల డిమాండ్



వ్యర్థాలతో నిండిపోయిన పంట కాలువ



ఐటీఐ కళాశాల ఆవరణలో నిలిచిన మురుగు నీరు

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంట కాలువలో మురుగు నీరు చేరి కలుషితమవుతూ పర్యావరణానికి, ఇటు ప్రజల ఆరోగ్యానికి హానికరంగా మారింది. స్థానిక చినరావూరు 14వ వార్డులో ఉన్న పంట కాలువలోకి స్థానిక డ్రెయిన్‌లోని నీరు చేరేలా ఆ శాఖ అధికారులు కాలువలోకి మురుగునీరు మళ్లించారు. దీంతో పంట కాలువ, మురుగు కాలువగా మారిపోయింది. కాలువకు ఇరుపక్కలా నివసించే గృహాల ప్రజలు ఆ కాలువలో వ్యర్థాలు రోజులతరబడి నిలిచిపోవడంతో దాని నుంచి వచ్చే దుర్గంధం, దోమలతో బెంబేలెత్తిపోతున్నారు. ఒకప్పుడు ఆ పంట కాలువ రైతులకు సాగునీరు అందించేలా ఉండేది. అధికారుల అనాలోచన నిర్ణయాలతో స్థానికంగా ఉన్న డ్రెయిన్‌లను దానికి అనుసంధానం చేశారు. ఆ మురుగునీరు స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో చేరి మురుగు తటాకాలను తలపిస్తున్నాయి. వాటిపై అధికారులు పట్టించుకోవడంతో పందులు ఆ వ్యర్థాలలో పొర్లాడి, స్థానికంగా సంచరిస్తూ వ్యాదులకు కారణమవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. మరోపక్క దోమలు ఉధృతంగా పెరిగి పగలు రాత్రి తేడాలేకుండా కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ శివారు కాలనీలు కావడంతో ఒకప్పుడు ఎంతో ప్రశాంతంగా జీవించేవారమని, పంట కాలువలో డ్రెయిన్‌ల మురుగునీరు, వ్యర్థాలు చేరడంతో వాటిద్వారా ఎటువంటి వ్యాధుల బారిన పడతామోనని స్థానికులు భయం భయంగా గడిపే పరిస్థితి. ప్రజలు అనారోగ్య సమస్యల బారినపడి మంచం పట్టకముందే సంబంధితశాఖ అధికారులు మేల్కొని సమస్యలను పరిష్కరించాలని ఆ ప్రాంతవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వ్యర్థాలను తొలగించాలి

పంట కాలువలోని మురుగు నీరు, వ్యర్థాలతో కలుషితమై ఆ ప్రాంతమంతా అపరిశుభ్ర వాతావరణంతో స్థానికులు అనారోగ్య సమస్యల బారినపడే ప్రమాదం ఉందని జాతీయ మానవ హక్కుల సంఘ సభ్యుడు పల్నాటి నాగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నామంటూ ప్రచారంచేసే అధికార యంత్రాంగానికి పంట కాలువ నీటిలో మురుగు నీరు కలిసి, రైతులకు, స్థానికులకు తీవ్రనష్టం కలుగుతుంటే కన్పించడం లేదా అని ఆయన ప్రశ్నిస్తున్నారు. తక్షణమే డ్రెయిన్‌లను పరిశీంచి సమస్య పరిష్కారానికి ముందుకు రావాలని నాగరాజు డిమాండ్ చేశారు.

ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవద్దు

- జిల్లా వ్యాప్తంగా 156 కొనుగోలు కేంద్రాలు
- జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ్

తెనాలి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంటలను దళారులను నమ్మి తక్కువ ధరలకు అమ్ముకుని రైతులు మోసపోవద్దని జేసీ భార్గవ్ తేజ్ చెప్పారు. బుధవారం తెనాలిలోని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గౌడౌన్‌లో రైస్‌మిల్లర్లు కస్టమ్స్ మిల్లింగ్ ప్రక్రియలో భాగంగా ధాన్యానికి బదులుగా తత్సమాన బియ్యాన్ని 67శాతం అందించేలా చేపట్టిన కార్యక్రమాన్ని జేసీ భార్గవ్‌తేజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా భార్గవ్‌తేజ్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రైతు సేవా కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధరలకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ రైతులకు మేలు జరిగేలా ప్రభుత్వం బాధ్యత తీసుకుందన్నారు. జిల్లాలో 156 రైతు సేవా కేంద్రాలను 45క్లస్టర్ పాయింట్లుగా ఏర్పాటుచేసి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఖరీఫ్ 2024-2025 సీజన్‌కు సంబంధించి గుంటూరు జిల్లాలో ఇప్పటివరకూ సుమారుగా 3120 టన్నుల ధాన్యాన్ని సేకరించి వాటిని సంబంధిత రైస్ మిల్లులకు తరలించడం జరిగిందన్నారు. రైస్ మిల్లర్లందరూ ప్రభుత్వానికి సహకరిస్తూ ధాన్యం సేకరణలో భాగస్వాములు కావాలన్నారు. నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీపడకుండా ప్రభుత్వం వారు నిర్దేశించిన ప్రమాణాల మేరకు కస్టమ్ మిల్లింగ్ బియ్యం రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ సూచనల మేరకు ఏపీఎస్‌డబ్ల్యూసీ, గౌడౌన్ వద్ద నిర్ణీత సమయంలోపు అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సంజనాసింహ్హా, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ జి.లక్ష్మి, సివిల్ సప్లయిస్ అధికారి కోమలి పద్మ, మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, ఏపీఎస్ డబ్ల్యూసీ మేనేజర్ నాగేశ్వరరావు, మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.వెంకయ్య చౌదరి, పలువురు అధికారులు పాల్గొన్నారు.



మిల్లర్ అసోసియేషన్ నాయకులకు సూచనలు చేస్తున్న జేసీ భార్గవ్ తేజ్

రాజకీయాల్లో రోశయ్యది చెరగని స్థానం

రోశయ్య వర్ధంతి కార్యక్రమంలో పలువురి నివాళి

తెనాలి అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేశ రాజకీయాల్లో మాజీ గవర్నర్, దివంగత కొణిజేటి రోశయ్యకు చెరగని స్థానం ఉందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. రోశయ్య 3వ వర్ధంతి బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. నియోజకవర్గ పార్టీ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు మాట్లాడుతూ, నిష్కళంక నాయకుడిగా, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు పాటుపడ్డ వారిలో రోశయ్య ఒకరని, ఆయనను నేటి తరం నాయకులంతా ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పొన్నూరు శశి, ద్వారకా శ్రీనివాస్, బుల్లియ్య, పూర్ణచంద్రరావు, శంకరరావు, కోటేశ్వరరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఎస్‌ఆర్‌కే కెఎస్‌ఆర్ గుప్తా డిగ్రీ కళాశాలలో కొణిజేటి రోశయ్య వర్ధంతి నిర్వహించారు. ప్రిన్సిపల్ గోగినేని విజయకృష్ణ, శ్రీనివాసరావు, దశరద రామిరెడ్డి, రఫీ, బాలగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

● బోసురోడ్డులోని శ్రీవాసవీ ఆలయ ఆవరణలో మాజీ గవర్నర్ దివంగత కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. జిల్లా ఆర్య వైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో రోశయ్య వర్ధంతి నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాలరావు, కార్యదర్శి బూరెల నరసింహారావు, అచ్యుత సాంబశివరావు, కొప్పురావూరి కిషోర్, భాస్కరుని శ్రీనివాసరావు, నాళం రజని, వుప్పల వరదరాజులు, మద్దాళి శేషాచలం, తిరుమలరావు, పలువురు ఆర్యవైశ్య నాయకులు రోశయ్యకు నివాళులర్పించారు.



మాజీ గవర్నర్ రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పొన్నూరులో...

పొన్నూరు టౌన్, డిసెంబరు 4: తెలుగు జాతి ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన మహోన్నత వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య అని ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి బాపనపల్లి ప్రభాకర లక్ష్మీ ప్రసాదరావు అన్నారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 3వ వర్ధంతి బుధవారం ఇందిరా వృద్ధాశ్రమంలో జరిగింది. ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అవ్వారు వెంకటేశ్వరరావు, లింగమల్లు మోహన కృష్ణ, దివ్వెల శ్రీనివాసరావు, కోట రవి శంకర్, బోనిశెట్టి రోశయ్య గుప్తా, తాటికొండ సుధీర్ తదితరులు పాల్గొన్నారు. వృద్ధాశ్రమంలోని వృధులకు అన్నదానం చేసి పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.



మాజీ ముఖ్యమంత్రి రోశయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి: ఆలపాటి

తెనాలి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలను ప్రజలందరికీ తెలిపి పార్టీ సభ్యత్వనమోదును వేగవంతం చేయాలని మాజీ మంత్రి, కృష్ణ-గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ చెప్పారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజవర్గపార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తెనాలి నియోజవర్గంలో టీడీపీని నిలబెట్టింది కార్యకర్తలేనన్నారు. గత వైసీపీ పాలనలో ఎన్నో అవమానాలు, బెదిరింపులు చవిచూశారని వాటన్నింటిని తట్టుకుని నిలబెట్టిన ఘనత ఇక్కడ పార్టీ కేడర్‌దన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కూడా ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించి సభ్యత్వాల నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేసి నియోజకవర్గానికి ఉన్న గుర్తింపును మరింత పెంచాలని సూచించారు. కార్యక్రమంలో తెనాలి, కొల్లిపర మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్



వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులతో కళాశాల నిర్వాహకులు

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పీబీఎన్ విద్యార్థుల ప్రతిభ

పొన్నూరు టౌన్, డిసెంబరు 4: వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పీబీఎన్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు కళాశాల ప్రెసిడెంట్ ఎస్.అంకప్పచౌదరి తెలిపారు. బుధవారం కళాశాలలో విద్యార్థుల అభినందన కార్యక్రమం జరిగింది. ఈ నెల 3వ తేదీ వరకు ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో సౌత్ వెస్ట్ ఇంటర్ యూనివర్శిటీ పోటీల్లో పీబీఎన్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. డి.మౌలాలి 61కేజీల విభాగంలో 255 కిలోల బరువు ఎత్తి సిల్వర్ మెడల్ సాధించారు. 89కిలోల విభాగంలో క్రిశ్రీను, 250 కిలోలు, సీహెచ్ వంశీ 109 విభాగంలో 275 కిలోల బరువు ఎత్తారు. వీరు పంజాబ్ రాష్ట్రంలో లౌలీ ప్రొఫెషనల్ యూనివర్శిటీలో జనవరిలో జరగబోయే ఆల్ ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి ఎన్ అన్నారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శివకుమారి, ఫిజికల్ డైరెక్టర్ కె భానుప్రసాద్ తదితరులు అభినందించారు.

11న డీఈవో కార్యాలయం వద్ద నిరసన

చేబ్రోలు, డిసెంబరు 4: ఉపాధ్యాయ సమస్యలపై ఈ నెల 11వ తేదీన డీఈవో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపడుతునట్లు యూటీఎఫ్ అధ్యక్షుడు కె.విజయ రాజు తెలిపారు. బుధవారం ఎంఈవో సుబ్బారావుకు ఉపాధ్యాయ సమస్యలపై యూటీఎఫ్ నాయకులు వినతి పత్రం అందచేశారు. ఉపాధ్యాయులు శెలవులపై నిబంధనలు విధించటం, సంక్రాంతి శెలవు దినాల్లో పనిచేయాలనటం, అపార్ కార్డుల జారీలో ఉన్న ఇబ్బందులు తదితర సమస్యలపై ఈ నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. ధర్నాలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రంలో యూటీఎఫ్ నాయకులు టి పార్థసారథి, శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, వై రమేష్‌బాబు, నాగేశ్వరరావు, జి వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



ఎంఈవో సాల్మన్‌రాజుకు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘనాయకులు

100 రోజుల యాక్షన్ ప్లాన్‌పేరుతో ఒత్తిడికి గురి చేయవద్దు

కొల్లిపర, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల 100 రోజుల యాక్షన్ ప్లాన్‌పేరుతో ఉపాధ్యాయులను ఒత్తిడికి గురి చేయవద్దని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కుర్రా కేదార్‌నాధ్ అన్నారు. బుధవారం స్థానిక విద్యావనరుల కేంద్రం వద్ద మండల యూటీఎఫ్ అధ్యక్షుడు వరప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ యూటీఎఫ్ సంఘ నాయకులు విద్యాశాఖాధికారులు అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేదార్‌నాథ్ మాట్లాడుతూ పాఠశాలల పని వేళల పెంపు, 10శాతం మించి ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదని ఆంక్షలు, విద్యార్థుల వివరాలు అపార్ నమోదు వంటి నిర్ణయాలు వలన ఉపాధ్యాయులు అనారోగ్యం బారినపడే అవకాశం ఉందన్నారు. ఈ అసంబద్ధ నిర్ణయాలు ఉపాధ్యాయులను తీవ్ర ఆందోళనకు, మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నాయని వీటిని ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై 11వ తేదీన జిల్లా డీఈవో కార్యాలయం ఎదుట, 16న రాష్ట్ర విద్యా కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఉపాధ్యాయ సంఘనాయకులు ఎంఈవో సాల్మన్‌రాజు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి వాహబ్, మండల కోశాధికారి కాలేషావలి, ఉపాధ్యక్షురాలు శ్యామల, సుగుణకుమారి, సూర్యకుమారి, నాగమల్లేశ్వరి, శ్రీరామ్ పాల్గొన్నారు.

నోటి పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ శ్రద్ధచూపాలి

● జిల్లా ప్రభుత్వవైద్యశాల డాక్టర్ సుజిత





తెనాలి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నోటి పరిశుభ్రతల విషయంలో ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలని జిల్లా ప్రభుత్వ వైద్యశాల దంత వైద్యురాలు డాక్టర్ సుజిత సూచించారు. దంత సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అందుబాటులో ఉన్న చికిత్సా విధానాలపై బుధవారం ఆంధ్రజ్యోతికి తెలిపిన వివరాలు వివరాలు.

ప్రశ్న: పంటినొప్పి రావడానికి కారణాలేంటి?

జవాబు: ప్రతిరోజు మనం తినే వివిధ రకాల ఆహార పదార్థాలను పంటితోనే నములుతాము. తరువాత వాటిని శుభ్రం చేసుకోవడంలో పెద్దగా శ్రద్ధచూపం. దీంతో తిన్న ఆహార పదార్థాలు పంటిపైనే ఉండి అవి బ్యాక్టీరియాగా మారి దంత సమస్యలకు కారణమవుతాయి.

ప్రశ్న: పంటినొప్పి వల్ల ఎటువంటి సమస్యలు వస్తాయి?

జ: పంటినొప్పితో దవడలు వాయడం, చిగుళ్లపై పూతలా రావడం, తినడానికి ఇబ్బందులు పడతంతో పాటు మాట్లాడేందుకు కూడా వీలుండదు. నొప్పి, జ్వరం ఇతర సమస్యలతో రోగి తీవ్ర బాధను అనుభవిస్తుంటారు.

ప్రశ్న: పంటి సమస్యలతో వచ్చేవారికి ఎటువంటి చికిత్స అందిస్తారు?

జ: దంత, నోటి సమస్యలకు లేజర్ చికిత్స ప్రాచుర్యం పొందింది. లేజర్ డెంటిస్ట్రీ అనే ప్రత్యేక పరికరంతో ఈ చికిత్స చేస్తారు.

ప్రశ్న: లేజర్ చికిత్సతో దంత సమస్యలను తొలగించవచ్చా?

జ: లేజర్ డెంటిస్ట్రీతో సమస్య ఉన్న చోట చుట్టుపక్కల కణజాలాలకు ఎలాంటి నష్టం జరగకుండా దంతాలను మెరిసేలా చేయడంలోనూ, చిగుళ్ల సమస్యలను నివారించడంలోనూ, సున్నిత దంతాలకు ఉపశమనం కల్గించడంలోనూ, బ్యాక్టీరియాను నివారించడంలోనూ లేజర్ డెంటిస్ట్రీ మంచి ఫలితాలను ఇస్తుంది. దీనికి మత్తు ఇవ్వవలసిన అవసరంగాని కుట్లు వేయాల్సిన పనికూడా ఉండదు.

ప్రశ్న: దంత సమస్యలు రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జ: రెండు పూటలా సున్నితమైన బ్రెష్‌తో దంతాలను, అనంతరం నాలుకను శుభ్రం చేసుకోవాలి. అంతేకాకుండా ఆహారం తీసుకున్న తరువాత నీటితో నోటిని పుక్కిలించి ఊస్తే, దంత సమస్యల బారిన పడకుండా ఉండవచ్చు.

పారిశుధ్య పనుల్లో అలసత్వం సహించను

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులలో అలసత్వం వహిస్తే సహించనని పట్టణ పురపాలక సంఘ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక శానిటేషన్ సిబ్బందిని హెచ్చరించారు. పురపాలక సంఘ పరిధిలోని 23వ వార్డులో బుధవారం జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శానిటేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. డ్రెయిన్‌లలోని మురుగును, రోడ్లపై ఉన్న చెత్తను పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, టీపీవో సాంబశివరావు, ఏఈ సునీల్ కుమార్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శానిటేషన్ పనులను పర్యవేక్షించి సూచనలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక తదితరులు



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శేషన్న

నిర్ణీత సమయంలో పనులను పూర్తిచేయండి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులకు సూచించారు. బుధవారం పట్టణంలో పలు ప్రాంతాలలో జరగుతున్న రోడ్డు విస్తరణ పనులను మున్సిపల్ కమిషనర్ శేషన్న ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా శివాజీచౌక్‌లో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో జరుగుతున్న విస్తరణ పనులను త్వరతిగతిన పూర్తిచేసి పురప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. అనంతరం బోసురోడ్డు, ఆర్‌ఆర్ నగర్‌లో జరుగుతున్న పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

చినరావూరు పార్క్‌లో...

చినరావూరులోని సత్యనారాయణ పార్క్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు అధికారులతో కలసి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ శ్రీనివాసరావు, ఏఈ సూరిబాబు, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి: డీఎంహెచ్‌వో

కొల్లిపర, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాల్సిన బాధ్యత వైద్యులు, ఆరోగ్య సిబ్బందిపై ఉందని డీఎంహెచ్‌వో కుర్రా విజయలక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని మందులను, సిబ్బంది హాజరు పట్టీని, రికార్డులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి లక్ష్మీసుధ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.